
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, కీళ్లనొప్పులు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :92 | సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | బుధవారం 12 ఆగస్టు 2026 | పేజీలు :12 | వెల రూ5 /-




## రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు..

**క్షేత్రస్థాయి ప్రయోగాలకు కేంద్రం ఆమోదం**

**ముంబై, ఆగస్టు11:**దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం-1934'లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో - మిగతా3లో

# మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలి

**సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 11 :** హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం ఈరోజు (మంగళవారం) **MCRHRD**లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి..**

పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్..**

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## గెట్ రెడీ విత్ మీ అంటున్న మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:**దేశంలో జెన్ జీ ఉద్యమం ప్రారంభమైంది. ఇందులో సోషల్ మీడియా ప్రముఖ పాత్రే పోషించింది. దీంతో రాజకీయ నేతలు కూడా అలర్ట్ అయ్యారు. మరీ ముఖ్యంగా నిత్యం టెక్నాలజీని వాడటంలో ముందుండే ప్రధాని మోదీ టెక్నాలజీని మరింత విస్తృతంగా వాడేస్తున్నారు. ఏది చెప్పాలన్నా, వీడియో రూపంలోనే తన సందేశాన్ని ఇస్తున్నారు. జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ ఏకంగా నాలుగు వీడియోల ద్వారా తన సందేశాన్ని పంపించారు. అందులో "ఫ్రెండ్స్" అంటూనే సంబోధించారు. అప్పటి నుంచి ఇక.. వీడియోల ద్వారానే తన సందేశాన్ని పంపిస్తున్నారు.తాజాగా కూడా ప్రధాని మోదీ ఇదే చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మోదీ, ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో కూడా యువతనే టార్గెట్ గా చేస్తూ సంభాషించారు.ఒక కొత్త ఇన్‌స్టాగ్రామ్ రీల్‌ను పోస్ట్ చేస్తూ, - మిగతా3లో

## టెసరాక్ట్ కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు

**చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్:**పక్క రాష్ట్రం కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య సతీమణికి.. అక్కడి ప్రభుత్వం మూడెకరాల భూమి కేటాయించిందని బీజేపీ ఫిర్యాదు చేసింది. ఆ వ్యవహారంలో లోకాయుక్త తీర్పు ఇచ్చింది. చివరికి సిద్ధరామయ్య రాజీనామా చేసేదాకా వచ్చిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణలో టెసరాక్ట్ అనే కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు. టెసరాక్ట్ కంపెనీకి రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్. ఆ విషయాన్ని కొండల్ రెడ్డే లింక్డ్ ఇన్ ప్రొఫైల్లో పెట్టుకున్నారు. టెసరాక్ట్ కంపెనీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పరికరాలను తయారు చేస్తుందట. అమెరికా ఎంబసీ ప్రతినిధితో హైదరాబాద్లో మీటింగ్ కూడా పెట్టారు. యూఎస్ ఇండియా స్ట్రాటెజిక్ డెవలప్ మెంట్ ఫోరంలో.. ఎగ్జిక్యూటివ్ బోర్డులో కొండల్ రెడ్డికి సభ్యత్వం ఇచ్చారని అన్నారు.కొండల్ రెడ్డి ఏం చదివారో నాకు తెలియదు. టెసరాక్ట్ కంపెనీకి కొండల్ రెడ్డి చైర్మన్ అని అమెరికా కాన్సులేట్ కూడా స్టేట్ మెంట్ ఇచ్చింది.చదువురాని రేవంత్ బ్రదర్స్ అందరూ సూట్లు కోట్లు వేసుకుని చైర్మన్లు అయిపోతున్నరు. టెసరాక్ట్ కంపెనీ కథ ఏంటని మేం ఆరా తీశాం. ఆ కంపెనీ ఫోన్ నంబర్ 123456789 అట. ఇలాంటి నంబర్లు ఉంటాయని మాకు తెల్వదు. రేవంత్ ఏదైనా కొత్త టెక్నాలజీ కనిపెట్టిండేమో? విచిత్రం ఏంటంటే టెసరాక్ట్ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడు. 2025 మార్చి 31 నాడు వాళ్లే ప్రకటన చేశారు. తమ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేడని చెప్పారు. ఊరూ పేరు లేని - మిగతా3లో

## తెలంగాణలో సర్వేల గుబులు.. రెండేళ్లకు ముందేనా....



**హైదరాబాద్, ఆగస్టు 11:**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లు ఇప్పటి నుంచే ప్రైవేట్ సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో టెన్షన్ నెలకొంది. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై వస్తున్న రహస్య సర్వే నివేదికలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో అధికార పార్టీలో కలవరం రేగుతుంది. అదే సమయంలో ఈ సర్వేల్లో నిజమెంత? అబద్ధమెంత? అన్నది మాత్రం తెలియడం లేదు. తెలంగాణలో ఎన్నికలు జరగడానికి ఇంకా రెండేళ్లు సమయం ఉంది. జమిలీ ఎన్నికలు జరిగితే మూడేళ్ల తర్వాత కాని తెలంగాణలోను ఎన్నికలు జరగవు... కానీ ముందే అనేక ప్రయివేటు సంస్థలు సర్వేలు నిర్వహిస్తు రాజకీయ పార్టీల్లో గుబులు రేపుతున్నాయి. అయితే ఇవి పెయిడ్ సర్వేలని తమకు అనుకూలంగా రాని పార్టీలు కొట్టిపారేస్తున్నా... ఎక్కడో ఏదో అనుమానం. ప్రజల్లో నిజంగా అసంతృప్తి ఉందా? అని అధికార పార్టీ, ప్రజల్లో తమ పార్టీకి అనుకూలత లేదా? అని విపక్ష పార్టీలు ఆందోళనలో పడ్డాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హామీల అమలు తీరుపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను

## ఆగస్టు 15న జెండా పండుగను సగర్వంగా నిర్వహించుకుందాం

**: ప్రధాని మోదీ..**



**ఢిల్లీ:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ (మంగళవారం) ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు.

## పేద పిల్లల కలలకు చిరునామాగా... యంగ్ ఇండియా స్కూల్స్

**సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

**సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్..**

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ - మిగతా3లో

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

**: మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, ఆగస్టు 11 :** పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. ఈరోజు (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని - మిగతా3లో

## 3 కోట్ల 36 లక్షలు ఓట్ల డిజిటైలేషన్ పూర్తి




**హైదరాబాద్, ఆగస్టు11:**తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ భారీ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. సేకరించిన సమాచారంలో ఇప్పటి వరకు దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ పూర్తి చేయగా, నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. అయితే ఈ నమోదు సరళిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ఓటర్ల జాబితా స్వరూపమే మారిపోనుందని స్పష్టమవుతోంది.మరోవైపు, క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులకు సవాలుగా మారిన అనేక అంశాలు వెలుగుచూశాయి. మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను (21.70 శాతం) వివిధ కారణాల వల్ల సేకరించలేకపోయినట్లు అధికారులు 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో అత్యధికంగా - మిగతా3లో

వార్తాతరంగాలు
బుధవారం 12 ఆగస్టు 2026

## సంపాదకీయం

# 'డిజిటల్' భారం సరికాదు!

ప్రారంభమై పదేళ్లు గడిచాక యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సాగే డిజిటల్ లావాదేవీలకు వడ్డింపు మొదలుకాబోతోంది. లోక్‌సభలో గురువారం గందర గోళం నెలకొన్నప్పుడు, ఎలాంటి చర్చా లేకుండా ఇందుకు సంబంధించిన బిల్లుఆమోదం పొందిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. తక్షణమే వర్తించకపోయినా భవిష్యత్తులో ఎప్పుడైనా యూపీఐ లావాదేవీలపై రుసుము వసూలు చేసేందుకు ఈ బిల్లు అధికారమిస్తోంది. ఫీజంటూ వసూలు చేస్తే రూ. 2,000కు మించిన లావాదేవీలపై, అది కూడా వార్షిక టర్నోవర్ కోటిన్నర మించే వ్యాపారులకే వర్తిస్తుందని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. విధించబోయే ఫీజు కూడా ఒక్కో లావాదేవీకి 0.25 శాతం లేదా 0.5 శాతం ఉండొచ్చన్నది మరో మాట. సాధారణ యూపీఐ వినియోగదారులు సాగించే లావాదేవీలన్నీ ఎప్పటిలా యధాతథంగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని విశ్వసించలేం. ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉన్నప్పుడు ఆ చట్టానికి ముందూ మునుపూ సవరణలు రాబోవని చెప్పలేం. ఆ సంగతలావుంచి తమపై రుద్దే ఈ చార్జీల్ని వ్యాపారులు వినియోగదారుకే బదిలీ చేస్తారు. ఆ అవకాశం లేకుండా తగిన నియంత్రణలు విధిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా? దేశంలో ఆర్థిక సంస్కరణల ఆగమనంతోపాటే పాలకులు కొత్త రాగం అందుకున్నారు. ప్రభుత్వాలు పాలించాలి తప్ప వ్యాపారం చేయడమేమిటన్నదే దాని సారాంశం. ఆ వంకన లక్షలాదిమంది సిబ్బంది పనిచేసే దిగ్గజ పబ్లిక్ రంగ సంస్థలు అనేకం కనుమరుగయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు గర్వకారణంగా నిలిచి, ఆసియాలోనే అతిపెద్దదైన నిజాం షుగర్స్ కాస్తా ఆనాటి సీఎం చంద్రబాబు పుణ్యమా అని మూతబడింది. కోట్లాది రూపాయల విలువైన దాని ఆస్తుల్ని కారుచవగ్గా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. నిజాం షుగర్స్ మాదిరిగా మరెన్నో పబ్లిక్ రంగసంస్థలకు తాళాలుపడ్డాయి. వ్యాపారమంటే వదులుకున్నాయిగానీ... ప్రభుత్వాలకు వ్యాపార దృక్పథం పోలేదని యూపీఐ లావాదేవీలపై ఫీజు వసూలు ఆలోచన నిరూపిస్తోంది. యూపీఐ, రూపే వంటివి ఉచిత సేవలు అందించటంవల్ల తమవీసా, మాస్టర్‌కార్డ్ వగైరా ప్లాట్‌ఫాంలు ఎదగటంలేదన్న అమెరికా ఆక్రోశమే తాజా నిర్ణయానికి కారణమని కొందరి ఆరోపణ. బ్రెజిల్‌పై సైతం అమెరికా ఈ మాదిరి ఒత్తిడే తెచ్చినా అది అంగీకరించలేదని కూడా చెబుతున్నారు. వాటి నిజానిజాల సంగతలావుంచి, ప్రభుత్వం చెప్పే కారణాలు మాత్రం ఎప్పటినుంచో వింటున్నవే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ తడిసిమోపెడు భారమవుతున్నదని బ్యాంకులూ, పేమెంట్ ప్రాసెసర్లూ గగ్గోలు పెడుతుండటంవల్ల ఇది తప్పడం లేదట! లావాదేవీల నిర్వహణ భారంలోకొంతమేర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. దాంతోపాటు ఈ లావాదేవీలు పెరిగాకబ్యాంకులు తమ సిబ్బందిని తగ్గించుకోలేదా? ఆమేరకు వాటి ఖర్చు తగ్గలేదా? అదీగాక గత దశాబ్దకాలంలో బ్యాంకింగ్ సేవల చార్జీలు, కనీస మొత్తం ఖాతాలో లేదన్న కారణంతో వసూలు చేసే పెనాల్టీ, పరిమితికి మించిన లావాదేవీలపై చార్జీలు, ఎస్ఎంఎస్‌సందేశాలకని, డెబిట్ కార్డు నిర్వహణ వ్యయమని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇవన్నీ చాలకనా ఈ కొత్త ఆలోచనలు! ఈ పదేళ్లలో డిజిటల్ లావాదేవీలు అపారంగా పెరిగాయి. అయినా ఈ పెరుగుదల తగినంతగా లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే వగైరాలు వినియోగిస్తున్నవారు వాటిని బ్యాంకింగ్ సేవలుగా చూడటం లేదు... ఆ యాప్‌లను పర్స్‌గా పరిగణించి లావాదేవీలు జరుపుకొంటున్నారు. అలవాటు చేసినట్టే చేసి,దాన్నుంచి కూడా ఆదాయం పొందాలనుకోవటం సరికాదు. ప్రస్తుతం దేశంలో డిజిటల్ లావాదేవీల వినియోగదారుల సంఖ్య 50 కోట్లని చెబుతున్నారు. అయితే ఒక వినియోగదారు సగటున చేసే లావాదేవీలు చూస్తే ప్రపంచ స్థాయికన్నా తక్కువే. అలాగే లావాదేవీల్లో 86 శాతం రూ.500, అంతకన్నా తక్కువ మొత్తాలేనని అంటారు. మొదట్లో ఉన్నంత వృద్ధి ఇటీవలి సంవత్సరాల్లో కనబడటం లేదని కూడా అంటున్నారు. ఇదంతా ఏం చెబుతోంది? ఎంతో వెసులుబాటుగా, ఉపయోగకరంగా ఉన్న ఈ లావాదేవీలు మరింత విస్తరించాల్సిన తరుణంలో వాటిని నిరుత్సాహపరిచేలా, జనం మళ్లీ నగదు వైపు మొగ్గేలా చేయటం వింతకాదా? ప్రభుత్వం ఆలోచించాలి.

# రక్షణ రంగంలో... 62.66 శాతం భారీ వృద్ధి

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:**భారతదేశ రక్షణ రంగ ఎగుమతులు మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త మైలురాయిని అధిగమించాయి. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు ఏకంగా రూ. 38,424 కోట్లకు చేరి, మునుపటి ఏడాదితో పోలిస్తే 62.66 శాతం భారీ వృద్ధిని నమోదు చేశాయి. ఒకప్పుడు కేవలం 'బ్రహ్మోస్' సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ మాత్రమే భారత ఎగుమతులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేది. కానీ మారుతున్న ఆధునిక యుద్ధ తంత్రాలకు అనుగుణంగా ప్రస్తుతం భారతదేశం డ్రోన్లు, ఖచ్చితత్వంతో దాడి చేసే గైడెడ్ క్షిపణులు, రాడార్లు మరియు అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ పరికరాలను ప్రపంచ దేశాలకు సరఫరా చేస్తోంది.ప్రస్తుతం భారత్ నుండి ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాలకు రక్షణ సామగ్రి ఎగుమతి అవుతుండగా, ఎగుమతిదారుల సంఖ్య కూడా 145కు పెరిగింది. ముఖ్యంగా నోయిడాకు చెందిన ఐజీ డిఫెన్స్ అభివృద్ధి చేసిన 'కాల్' అనే




సుదూర లక్ష్యాలను ఛేదించే అటాక్ డ్రోన్ అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు 1000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, 50 కేజీల బరువును మోసుకెళ్లగల ఈ స్వదేశీ డ్రోన్ టెక్నాలజీ.. ఖరీదైన మిస్సైళ్లతో పనిలేకుండా శత్రు స్థావరాలను అత్యంత తక్కువ ఖర్చుతో అణచివేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.మరోవైపు, ఆయుధాల తయారీతో పాటు వాటి లోపల ఉండే "మేధో పార" అనగా ఎలక్ట్రానిక్ ఫ్యూజ్ మరియు గైడెన్స్ సిస్టమ్స్ విభాగంలో కూడా భారత్ అగ్రగామిగా ఎదుగుతోంది. పినాక రాకెట్ లాంచర్లు, ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, స్వాతి వెపన్-లొకేటింగ్ రాడార్లతో పాటు అధునాతన యుద్ధ విమానాల విడిభాగాలను కూడా విదేశీయులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఈ వేగవంతమైన పురోగతిని చూస్తుంటే 2029-30 నాటికి రక్షణ ఎగుమతుల్లో రూ. 50,000 కోట్ల లక్ష్యాన్ని భారత్ చాలా సులువుగా చేరుకుంటుందని రక్షణ శాఖా నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్.. పోస్టింగ్ కోసం తిప్పలు

**హైదరాబాద్, ఆగస్టు 11:**కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్.. మహిళా ఐఏఎస్ అధికారులు. వీరిద్దరిలో దూకుడు ఎక్కువ. డైనమిక్ గా పనిచేసే తీరు ఎక్కువ. పైగా వీరిని సూపర్ స్టార్ ఐఏఎస్ అధికారులు అని పిలిచేవారు. వార్తల్లో కూడా ఎక్కువగా కనిపించేవారు.అందానికి అందం.. పని తీరుకు పని తీరు.. ఫలితంగా వీరిద్దరూ మీడియాలో నిత్యం కనిపించేవారు. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయాలలో పనిచేసే తమ సమర్థతను నిరూపించుకున్నారు. మీడియా వీరిద్దరి గురించి ఎక్కువగా వార్తలు రాస్తూ ఉండేది. సోషల్ మీడియాలో ఈ ఇద్దరు అధికారులు ఎక్కువగా యాక్టివ్ గా ఉండేవారు. విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉన్న ఈ అధికారులకు పోస్టింగ్ ఎందుకు లభించలేదు.. గ్రాఫ్ ఎందుకు తగ్గిపోయింది.. రాజకీయ సమీకరణాలు.. ఇతర అంశాలు వీరికి ఇబ్బందికరంగా మారాయా..ఆమ్రపాలి తనకు పోస్టింగ్ కేటాయించే విషయంలో న్యాయపోరాటం చేసింది. అందులో గెలిచింది. ఈమెకు డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ కేటాయింపులలో ఏపీ క్యాడర్ లభించింది. ఈమెకు మొదటి నుంచి కూడా తెలంగాణ రాష్ట్రంలో పనిచేయాలనేది బలమైన ఆకాంక్ష. అనేక రకాలుగా పోరాటాలు చేసినప్పటికీ ఈమె ఏపీ క్యాడర్లో పనిచేయాల్సి వచ్చింది. సరైన ప్రాధాన్యం లభించకపోవడంతో వరుసగా సెలవులు తీసుకున్నారు. ఆ



తర్వాత ఎటువంటి బాధ్యతలు లేని నార్మల్ ట్రాన్స్ఫర్ ను ఎదుర్కొన్నారు. ఈయనకు సమర్థత ఉంది. కాకపోతే సమీకరణాలవల్ల పోస్టింగ్ కు దూరంగా ఉండాల్సి వస్తోంది. గతంలోని వరంగల్ కలెక్టర్ గా.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పని చేశారు. ఆ అనుభవాన్ని కూడా ప్రభుత్వం వినియోగించుకోలేదు. ఈమె క్రేజీ అధికారిగా పేరు తెచ్చుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎక్కువకాలం తెలంగాణ రాష్ట్రంలో పనిచేశారు. ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక అధికారిగా వ్యవహరించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులలో ముఖ్యపాత్ర పోషించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈమెకు విపరీతమైన ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. ఒక దశలో ఈమె నెక్స్ట్ టు సీఎం అన్నట్టుగా వ్యవహరించారు. ప్రభుత్వం మారిన తర్వాత స్మితకు ప్రాధాన్యం తగ్గిపోయింది. పైగా అస్మిత సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పరోక్ష విధానంలో విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఈమె వ్యవహార శైలిపై కూడా ప్రభుత్వ పెద్దలకు ఆగ్రహం ఉండడంతో ప్రాధాన్యం లేని విభాగాలు కేటాయించారు. దీంతో ఆమె ఆ బాధ్యతలు స్వీకరించడం కంటే.. ఖాళీగా ఉండడానికి ఇష్టాన్ని చూపించారు.ప్రభుత్వాలు మారినప్పుడు అధికారులకు ఇంపార్టెన్స్ తగ్గిపోతూ ఉంటుంది. అయితే కొంతమంది అధికారులు ప్రభుత్వాలకు తగ్గట్టుగా మారకుండా.. తమకంటూ ఓన్ స్టైల్ క్రియేట్ చేసుకోవడమే ఇక్కడ ఇబ్బందికరంగా మారుతుంది. స్మిత.. ఆమ్రపాలి వీరిద్దరూ సమర్థవంతమైన అధికారులు. రాజకీయ కారణాలవల్ల పోస్టులు లభించకపోవడంతో దీర్ఘకాలం సెలవులో ఉన్నారు ఇటువంటి అధికారులకు పోస్టింగులు లభించకపోవడం ఒకరకంగా ప్రజలకు ఇబ్బంది. సమర్థత ఉన్న అధికారులు దీర్ఘకాలం విశ్రాంతి తీసుకుంటే ప్రజా సమస్యలు పరిష్కారం కావడం దాదాపు అసాధ్యం.

# డబుల్‌డెక్ కారిడార్ డీపీఆర్ రెడీ

**హైదరాబాద్, ఆగస్టు 11:**హైదరాబాద్--ముంబయి జాతీయ రహదారిలో చందానగర్--గంగారం వద్ద ఫ్లైఓవర్‌పై మెట్రో వయాడక్ట్ ఉండేలా డబుల్‌డెక్ డిజైన్‌ను NHAI, HMRL సంయుక్తంగా ఖరారు చేశాయి. మియాపూర్--పటాన్‌చెరు మెట్రో విస్తరణతో సమన్వయం చేసేందుకు ఈ నమూనాను ప్రతిపాదించారు. మరోవైపు ఎల్బీనగర్--హయత్‌నగర్‌లోనూ డబుల్‌డెక్ నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి కోరుతున్నారు. అయితే అక్కడ మెట్రో అలైన్‌మెంట్ ఇప్పటికే సర్వీస్ రోడ్డు వెంట ఖరారై,డీపీఆర్ కేంద్రానికి చేరడంతో మార్పులు చేస్తే ఆలస్యం, వ్యయం పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరంలో రోడ్డు, మెట్రో మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు మరో కీలక అడుగు పడింది. నగరం నుంచి ముంబయి వైపు వెళ్లే జాతీయ రహదారి మార్గంలో చందానగర్--గంగారం ప్రాంతం వద్ద డబుల్‌డెక్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను జాతీయ రహదారుల సంస్థ, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ సంయుక్తంగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మార్గంలో ఒకే కారిడార్‌లో రహదారి ఫ్లైఓవర్‌తో పాటు దాని పైన మెట్రో వయాడక్ట్ నిర్మించేలా డిజైన్ రూపొందించారు.ప్రస్తుతం మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు విస్తరణకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇదే మార్గంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఒకే ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్డు ఫ్లైఓవర్, మెట్రో మార్గాలను వేర్వేరుగా నిర్మిస్తే భూసేకరణ, స్థల లభ్యత, నిర్మాణ వ్యయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు ప్రాజెక్టులను సమన్వయం చేసి డబుల్‌డెక్ రూపంలో నిర్మించాలనే ఆలోచనకు ప్రాధాన్యం లభించింది.ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రాంతాల్లో భవిష్యత్తులో మెట్రో విస్తరణ ఉంటే ముందుగానే డబుల్‌డెక్ నమూనాను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గతంలో సూచించారు. కింద రహదారి వాహనాల కోసం ఫ్లైఓవర్, దాని పైన మెట్రో వయాడక్ట్ ఉండే విధంగా ఈ నిర్మాణం ఉంటుంది. నాగ్‌పూర్‌లో ఇలాంటి డబుల్‌డెక్ కారిడార్‌ను దేశంలోనే తొలిసారిగా నిర్మించారు. ఒకే మార్గంలో రెండు రవాణా వ్యవస్థలకు స్థలం కల్పించడం ద్వారా భూసేకరణ అవసరాన్ని తగ్గించడంతో పాటు నగరాల్లో పరిమిత స్థలాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చన్నది ఈ నమూనా ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మార్గంలోనూ డబుల్‌డెక్ నిర్మించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబడుతున్నారు. అయితే చందానగర్--గంగారం మార్గంతో పోలిస్తే ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎల్బీనగర్--హయత్‌నగర్ మెట్రో విస్తరణకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను ఇప్పటికే సర్వీస్ రహదారి వెంబడి ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఇప్పుడు ఈ అలైన్‌మెంట్‌ను మార్చి ఫ్లైఓవర్‌పై మెట్రోను ఏర్పాటు చేసేలా డబుల్‌డెక్ నమూనాను అమలు చేస్తే ఇప్పటికే సిద్ధం చేసిన డీపీఆర్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది.డీపీఆర్‌లో మార్పులు, కొత్త డిజైన్, సాంకేతిక పరిశీలనలు, అనుమతుల ప్రక్రియ కారణంగా ప్రాజెక్టు అమలులో జాప్యం జరిగే



అవకాశం ఉందని మెట్రోరైలు అధికారులు మంత్రికి వివరించినట్లు సమాచారం. అదనంగా నిర్మాణ వ్యయం కూడా పెరిగే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన మెట్రో అలైన్‌మెంట్‌ను కొనసాగిస్తే పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని వారు సూచించినట్లు తెలిసింది.మరోవైపు హైదరాబాద్ మెట్రో రెండోదశకు కేంద్ర అనుమతులు త్వరలో వచ్చే అవకాశం ఉందన్న ఆశాభావం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరో రెండు నెలల్లో రెండోదశకు సంబంధించిన అనుమతులు వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేసిన నేపథ్యంలో, మెట్రో మార్గాల తుది అలైన్‌మెంట్, ఫ్లైఓవర్లతో సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారాయి. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని రహదారి, మెట్రో ప్రాజెక్టులను సమగ్రంగా ప్రణాళిక చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు

# రీల్ టీచర్స్....

**ఖమ్మం, ఆగస్టు 11:**ఆమె పేరు గౌతమి రాథోడ్. పేరుకు తగ్గట్టుగానే అందంగా ఉంటుంది. గొంతు కూడా శ్రావ్యంగా ఉంటుంది. పైగా గవర్నమెంట్ టీచర్. రీల్స్ చేయడం ఆమె చాలా ఇంట్రెస్ట్. తాను పనిచేస్తున్న స్కూల్లో రీల్స్ చేసేది.రీల్స్ ద్వారా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పాపులారిటీ సంపాదించుకుంది. సెలబ్రిటీ అయిపోయింది. అనుసరించే వారు కూడా భారీగా ఉండటంతో ఆమె రేంజ్ పెరిగిపోయింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. వచ్చిన ఫేమ్ ద్వారా ఆమె కొన్ని ప్రవేట్ సంస్థలకు ప్రచారం చేస్తున్నట్టు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. విచారణ నిర్వహించారు. ఆమెను సస్పెండ్ చేశారు.ఇటీవల ఆమెకు పోస్టు లభించింది. విధుల్లోకి వెళ్లాల్సిన ఆమె సోషల్ మీడియా ద్వారా ఒక వీడియో రిలీజ్ చేశారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆమె నిర్ణయం ఒక రకంగా సంచలనం కలిగించింది. ఆమె రీల్స్ చేస్తున్నప్పుడు తోటి ఉద్యోగులు హేళనకు గురిచేసారట. ఆమెను ఇబ్బంది పెట్టారట. తట్టుకోలేక కష్టపడి సాధించిన ఉద్యోగాన్ని వదులుకున్నానని గౌతమి సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసింది. తాను స్కూల్లో.. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో ఎటువంటి రీల్స్ చేయలేదని ఆమె స్పష్టం చేసింది. ఒకవేళ తాను అలా రీల్స్ చేసి ఉంటే విద్యార్థులు లేదా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు తనమీద ఫిర్యాదు చేసి ఉండేవారు కదా అంటూ ఆమె ప్రశ్నించారు.అప్పట్లో గౌతమి మీద విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసినప్పుడు.. దానిని తొలగించాలని ఆమె ఏకంగా ఆరు నెలల పాటు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరిగింది. చైతన్య జై ని ఆమెను కనీసం పట్టించుకోలేదు. తనను మనిషిలా కూడా చూడలేదని గౌతమి తన సెల్ఫీ వీడియోలో వాపోయింది. ఒక దశలో చైతన్య ఆమెను ఉద్దేశించి నువ్వు నా దగ్గరికి రావద్దు.. వెళ్లిపో అంటూ గట్టిగా కేకలు వేశారని గౌతమి సోషల్ మీడియాలో వాపోయింది. తన మీద ఆరు నెలలపాటు సస్పెన్షన్ వేటి వేసినప్పుడు తోటి ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయ సంఘాలు కనీసం అండగా నిలబడలేదని గౌతమి వాపోయింది.సరిగ్గా 6 నెలల క్రితం గౌతమి గురించి తెలంగాణ వ్యాప్తంగా చర్చ నడిచింది. రీల్స్ టీచర్గా ఆమె పేరు పొందింది. అయితే వచ్చిన పేరును ఆమె ఒక ప్రైవేట్ సంస్థ ప్రమోషన్ కోసం ఉపయోగించుకుంది. అందువల్ల విద్యాశాఖ అధికారులు ఆమె వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుపట్టారు.అంతేకాదు ఆమెను సస్పెన్షన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో ఈయన వ్యవహారం తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది. చివరికి ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

# హైదరాబాద్ ట్రాఫిక్, అధిక ఉష్ణోగ్రతలు..

## ఏటా 200 గంటలు నష్టపోతున్న నగరవాసులు

**హైదరాబాద్, ఆగస్టు 11:**హైదరాబాద్‌వాసులకు ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కొత్త సమస్యగా మారాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్ నగర ప్రజలు ఈ రెండు సమస్యలతో ఏటా 200 గంటలు నష్టపోతున్నారని తేలింది. ట్రాఫిక్ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతుండగా.. రాత్రి అధిక ఉష్ణోగ్రతల కారణంగా మరో 75 గంటల నిద్రను కోల్పోతున్నారని వెల్లడైంది. ఇక హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా ఉన్నట్లు తేల్చింది. వాహనాల పెరుగుదల, రహదారుల కొరత, ప్రజా రవాణా సామర్థ్యం, వాతావరణ మార్పులు ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.హైదరాబాద్‌లో జీవనం రోజురోజుకూ వేగంగా మారుతున్నా.. నగరవాసులు మాత్రం భారీగా సమయాన్ని నష్టపోతున్నారు. ఒకవైపు రోడ్లపై పెరుగుతున్న ట్రాఫిక్ గంటల కొద్దీ సమయాన్ని మింగేస్తుండగా.. మరోవైపు రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నగరవాసులకు నిద్రను దూరం చేస్తున్నాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్‌వాసులు ట్రాఫిక్ రద్దీ, వేడి రాత్రుల కారణంగా ఏడాదికి దాదాపు 200 గంటల సమయాన్ని కోల్పోతున్నారని వెల్లడైంది. అంటే ప్రతీ సంవత్సరం 8 రోజులకు పైగా సమయం హైదరాబాద్ నగర జీవన పరిస్థితుల కారణంగా వృథా అవుతున్నట్టేనని తేలింది.టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ తాజా రిపోర్ట్ ప్రకారం హైదరాబాద్‌లో ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతున్నారని తేలింది. ఇది 5 రోజులకు సమానం. నగరంలో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా నమోదైంది. సాధారణంగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సగటున 32.37 నిమిషాలు పడుతుండగా.. సాయంత్రం రద్దీ వేళల్లో పరిస్థితి



మరింత దారుణంగా ఉంటోంది. అదే 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 39.5 నిమిషాలు పడుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది.హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య భారీగా పెరగడం ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిపుణులు చెబుతున్నారు. నగరంలో వాహనాల సంఖ్య దాదాపు 80 లక్షలకు చేరినట్లు ఒక అంచనా ఉంది. దీంతో గత దశాబ్దంలో వాహనాల సంఖ్య దాదాపు రెట్టింపు అయినప్పటికీ.. అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణ, ప్రజా రవాణా సామర్థ్యం పెరగలేదని నిపుణులు పేర్కొంటున్నారు. మహానగరాల్లో ట్రాఫిక్ వేగం గంటకు 25 నుంచి 30 కిలోమీటర్ల మధ్య ఉండటం ఆదర్శంగా భావిస్తే.. హైదరాబాద్‌లో సగటు వేగం 15 కిలోమీటర్లకు మాత్రమే పరిమితమవుతోందని తేలింది. ఇక సాయంత్రం వేళ పీక్ అవర్స్‌లో ఇది 10 కిలోమీటర్లకు కూడా పడిపోతోందని రిటైర్డ్ ఇంజనీర్ టి సత్యనారాయణరెడ్డి తెలిపారు.హైదరాబాద్‌వాసులు సమయాన్ని కోల్పోవడం కేవలం రోడ్లపైనే ఆగిపోవడం లేదు. రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా నగరవాసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ సంస్థ 1,338 నగరాలపై నిర్వహించిన విశ్లేషణలో హైదరాబాద్‌లో అధిక రాత్రి ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఏడాదికి సుమారు 75 గంటల నిద్రను కోల్పోతున్నట్లు తేల్చింది. ఇందులో సుమారు 7 గంటల నిద్ర నష్టానికి నేరుగా వాతావరణ మార్పులే కారణమని ఈ అధ్యయనం అంచనా వేసింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏడాదికి సగటున 56 గంటల నిద్ర కోల్పోతుండగా.. హైదరాబాద్‌లో ఈ సంఖ్య 75 గంటలుగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2020 నుంచి 2025 వరకు ఉన్న డేటాను విశ్లేషించిన ఈ అధ్యయనం వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ భారతదేశంలోని ప్రజలు వేడి రాత్రుల కారణంగా ఏడాదికి 70 నుంచి 90 గంటల వరకు నిద్ర కోల్పోతున్నారని తేలింది.పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ భవనాలు, తారు రోడ్లు పగటి వేడిని ఎక్కువగా గ్రహించి రాత్రివేళ నెమ్మదిగా విడుదల చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో సూర్యాస్తమయం అయిన తర్వాత కూడా నగరాల్లో ఉష్ణోగ్రతలు త్వరగా తగ్గకపోవడం వేడి సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. పని వేళలు, ఒత్తిడి, ఆరోగ్య పరిస్థితులు, కెఫైన్ వినియోగం, వెలుతురు, శబ్దం, బెడ్‌రూమ్ పరిస్థితులు, తేమ వంటి అనేక అంశాలు నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తాయని పేర్కొంటున్నారు.అయితే వాతావరణ మార్పులు, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కూడా ఇప్పుడు తగినంత నిద్రకు అడ్డంకులుగా మారుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. హైదరాబాద్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్, రాత్రివేళ వేడి కలిసి నగరవాసుల విలువైన సమయాన్ని, విశ్రాంతిని రెండింటినీ హరిస్తున్నాయని అర్థం అవుతోంది.

# 2028 గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్

**హైదరాబాద్ ఆగస్టు 11:**2028 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సరికొత్త సంస్థాగత వ్యూహానికి తెరలేపింది. సాధారణంగా కేడర్‌కు ఇచ్చే పార్టీ పదవులను ఈసారి నేరుగా గెలిచిన ప్రజాప్రతినిధులకే కట్టబెడుతోంది. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే వ్యక్తం చేస్తున్న ధీమా వెనుక ఈ పక్కా సంస్థాగత ప్రణాళికే కారణమని తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్షాళన ప్రక్రియను పార్టీ అధిష్టానం ఏడాది కిందటే ప్రారంభించింది. జనవరి 2024లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నికైన బి. మహేష్ కుమార్ గౌడ్‌కు సెప్టెంబర్ 2024లో టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత కీలక పదవుల్లో ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నల్గొండ ఎంపీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి, సి.వంశీకృష్ణలకు కట్టబెట్టింది. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుదా ఎమ్మెల్యేలు వేడ్మ బొజ్జు, డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి, డాక్టర్ మట్ట రాగమయిలను నియమించింది..పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష పదవులను కూడా ప్రజాప్రతినిధులకే కేటాయించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యను టీపీసీసీ ఓబీసీ సెల్ ఛైర్మన్‌గా,



మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఎస్టీ సెల్ అధిపతిగా నియమించారు.ఱ నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ బాధ్యతలు వహించారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి పేరును పరిశీలించినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఆమె తిరస్కరించడంతో వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను ఆ పదవిలో నియమించారు.ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా నియమించగా, జిల్లా స్థాయిలోనూ ఐదుగురు ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారు. వారిలో బీర్ల ఐలయ్య, మేడిపల్లి సత్యం, చిక్కుడు వంశీకృష్ణ, వేడ్మ బొజ్జు ,ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఉన్నారు.ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు పార్టీ బాధ్యతలు ఇవ్వడం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ కారణాలను టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను, ఆరోపణలను బలంగా ఎదుర్కోవాలంటే అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ముందుకు రావడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పవర్ ఉన్న నేతలు కౌంటర్ ఇచ్చినప్పుడే దానికి ప్రాధాన్యత, విలువ ఉంటాయి. పదవులతో పాటు జవాబుదారీతనం, బాధ్యత పెరుగుతాయి. ఇది క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచనగా ఉంది.పార్టీ అధిష్టానం త్వరలోనే ఎంపీలు లేదా ఎమ్మెల్యేల నుంచి కనీసం ఇద్దరిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ఈ రేసులో బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కేవలం పార్టీ పదవులే కాకుండా, ప్రభుత్వం తరపున ఇచ్చే పలు కీలక నామినేటెడ్ పోస్టులను కూడా యియియిఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించి, పార్టీ సంస్థాగత పునాదులను రాష్ట్రవ్యాప్తంగా మరింత పటిష్టం చేయాలనేది కాంగ్రెస్ ప్రణాళిక.

# వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం...

**హైదరాబాద్:**ఎస్సీ వర్గీకరణతో మాల, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణలో మాలలకు దక్కిన 5 శాతం రిజర్వేషన్లు కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో నిర్వహించిన మాల అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. 1997 ఆగస్టు 11న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైదరాబాద్లో మాలలు చేపట్టిన నిరసనను అప్పటి సీఎం చంద్రబాబునాయుడు అడ్డుకున్నారని చెన్నయ్య ఆరోపించారు. పోలీసుల దాడిలో ఇద్దరు మృతి చెందగా, 600 మంది గాయపడ్డారని తెలిపారు. వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలులో రోస్టర్ పాయింట్ల కారణంగా మాలలకు అన్యాయం జరుగుతోందని, 20లోపు రెండు రోస్టర్ పాయింట్లు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు, విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ అవకాశాల్లో అన్యాయం జరగకుండా మంత్రుల సబ్కమిటీ చర్యలు తీసుకోవాలని కోరారు.

# 3 కోట్ల 36 లక్షలు ఓట్ల డిజిలైటేషన్ పూర్తి

- మొదటి పేజీ తరువాయి

45.18 లక్షల మంది ఓటర్లు తమ నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించగా, 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు నమోదైంది. మరో 11.25 లక్షల మంది అసలు జాడ తేలక అడ్రస్ దొరకని స్థితిలో ఉండగా, 6.70 లక్షల మందికిపైగా ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ భారీ వ్యత్యాసాలు, వలసల గణాంకాల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఊహించని పెద్ద మార్పులు చోటుచేసుకోనున్నాయి.రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, సోమవారం సాయంత్ర నాటికి కేవలం 2,64,73,616 మంది (78.26 శాతం) వివరాలు మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయ్యాయి. మిగిలిన 73,52,832 మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ లెవెల్ ఆఫీసర్లకు సమర్పించలేదు. లేదా వారు అందుబాటులో లేరు. ఈ ఓటర్లను అధికారులు ఏఎన్‌డీ(ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెడ్) జాబితాలో చేర్చారు.ముఖ్యంగా ఇప్పుడు గల్లంతైన ఓట్లలో అన్‌కలెక్టబుల్ జాబితాలో ఎక్కువ ఉన్నాయి. తర్వాత స్థానంలో నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా వల వెళ్లినట్టు గుర్తించారు. మిగతావి డూప్లికేట్ ఓట్లు అంటే ఒకే వ్యక్తికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉన్నట్టు తేలింది. ఓటరు జాబితాను పారదర్శకంగా మార్చటానికి కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రక్షాళన చేపట్టింది. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించినప్పుడు చాలా మంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం లేదా ఆధారాలు చూపకపోవడం వల్ల వారి పేర్లు గల్లంతవుతున్నాయి.మరో కీలక అంశం అంటే, గతంలో మ్యాపింగ్ సర్వే నిర్వహించినప్పుడు సుమారు 89 లక్షల ఓట్లలో 11 రకాల తేడాలను గుర్తించారు. వీటిని సవరించిన తర్వాత కూడా ఇప్పటికే యాభై లక్షలకుపైగా ఓట్లలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఓటర్లను కూడా ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

ప్రభావం ఎక్కువ ఎక్కడ ఉంది?

ఈ ఓట్ల గల్లంతు ప్రభావం గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా ఉంది. ఇక్కడ దాదాపు అరవై శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యింది. అంటే దాదాపు 20 లక్షల ఓట్లు ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్లాయి. మేడ్చల్-మల్కాజగిరిలో 70 శాతం డిజిటలైజేషన్ జరిగింది. రంగారెడ్డిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే అత్యధికంగా 95 శాతం డిజిటలైజేషన్‌తో అగ్రస్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో 92 శాతంతో జనగామా, 91 శాతంతో మెదక్, సూర్యాపేట ఉన్నాయి.

ఎప్పుడు ఏం జరుగుతుంది?

ఓటర్లు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి ఇంకా సమయం ఉంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. అక్టోబర్ 15 లోపు వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తారు. అక్టోబర్ 19న తుది జాబితా విడుదల చేస్తారు.

ఓటును ఎలా కాపాడుకోవాలి?

ఒక వేళ మీ పేరు ముసాయిదా జాబితాలో లేకపోయినా, లేదా ఏఎన్‌డీ జాబితాలో ఉన్నా ఆందోళన చెందాల్సిన పని లేదు. ఆగస్టు 17 తర్వాత ఈ-పోర్టల్ లేదా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌లో మీ పేరు ఉందో లేదో సరిచూసుకోండి. ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి సమర్పించాలి. ఒక వేళ పేరు తొలగించినట్టు అయితే, ఫారం -6 ద్వారా కొత్తగా మోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వలేదనే కారణంతో నేరుగా ఓటు తొలగించు. అధికారులు నోటీసులు ఇచ్చి, విచారణ చేసిన తర్వాతే తుది నిర్ణం తీసుకుంటారు.

## రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు..

- మొదటి పేజీ తరువాయి

పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. అందువల్ల, వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు, దీనికి ఎంత ఖర్చవుతుంది అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## గెట్ రెడీ విత్ మీ అంటున్న మోడీ

మొదటి పేజీ తరువాయి

చేనేత దుస్తులతో "గెట్ రెడీ విత్ మీ" వీడియోలను రూపొందించడం ద్వారా జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవాలని యువ భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ఈ ట్రెండ్ భారతదేశపు గొప్ప నేత సంప్రదాయాన్ని ప్రదర్శించడానికి మరియు కళాకారుల కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు.చేనేత వస్త్రాలు ధరించి భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు చేనేత కార్మికులకు, చిరు వ్యాపారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేలా చిన్న వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు. 1905 ఆగస్టు 7న బ్రిటీషర్లకు వ్యతిరేకంగా భారతీయులు స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారని ఆయన తన వీడియో సందేశంలో తెలిపారు.

## తెలంగాణలో సర్వేల గుబులు.. రెండేళ్లకు ముందేనా....

మొదటి పేజీ తరువాయి

అంచనా వేయడానికి పార్టీలు సర్వేలు చేపట్టాయి.నియోజకవర్గాల్లో నిధుల కొరత, ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు ఆశించదగ్గ రీతిలో లేదని సర్వేల్లో వస్తున్న టాక్ గుబులు పుట్టిస్తోంది.. భవిష్యత్తులో టికెట్ల కేటాయింపునకు ఈ సర్వేలనే ప్రామాణికంగా తీసుకుంటారనే ప్రచారం నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది.రాజకీయ పార్టీల వ్యూహాలుఅధికార కాంగ్రెస్ పార్టీ తరఫున అంతర్గత సర్వేల ద్వారా ప్రజాభిప్రాయాన్ని బేరీజు వేస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బీజేపీ కూడా గ్రౌండ్ రియాలిటీపై దృష్టి పెట్టాయి.ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రజా స్పందన ఆధారంగా పార్టీల వ్యూహాలను మారుస్తున్నాయి. తమకు సానుకూలత, అననుకూలత ఏ నియోజకవర్గాల్లో అంచనా వేసుకుని వాటిని దిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాయి. మొత్తం మీద రెండేళ్ల ముందే సర్వేలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో కాక రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

## టెసరాక్ట్ కంపెనీకి అప్పనంగా భూమి కేటాయించారు

- మొదటి పేజీ తరువాయి

చోట ఆ కంపెనీ అడ్రస్ ఉంది. టెసరాక్ట్ మూలధనం లక్ష రూపాయలు. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఈ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టింది. ఐదెకరాల భూమిని కేటాయించి, అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డారు. ఇది అనుముల కొండల్ రెడ్డి వ్యవహారం. అనుముల జగదీష్ రెడ్డి అని రేవంత్కు ఇంకో తమ్ముడు ఉన్నాడు. జగదీష్ రెడ్డి అమెరికాలో ఉంటాడు. రేవంత్ అమెరికా పర్యటనకు పోయినప్పుడు.. వెయ్యి కోట్ల డీల్ చేసుకున్నరు. స్వచ్ఛ బయో అనే కంపెనీతో ఒక మెమోరాండం సైన్ చేశారు. వాళ్లకు ఎక్కడ భూములు ఇచ్చారో తవ్వి తీస్తామని అన్నారు.రేవంత్ బామ్మర్ది సృజన్ రెడ్డికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు దక్కింది. రేవంత్ రెడ్డి, మోడీ ప్రభుత్వం కలిసి నడుపుతున్న సింగరేణిలో.. సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే అంతా నడుస్తోంది. సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు, వేల కోట్ల కుంభకోణాలు అన్నీ బయటపెట్టినం. ఈ పరంపరలో మేం బయటపెట్టిన తాజా కుంభకోణమే టెసరాక్ట్. వడ్డించే వాడే మనోడే అన్నట్టు భూములు కొట్టేశారు. రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రూ.7 కోట్లకు రాసిచ్చారు. ఇది స్కాం కాదా? పక్క రాష్ట్రం కర్ణాటకలో ఒక న్యాయం, ఇక్కడ ఒక న్యాయమా? టెసరాక్ట్ కథేంటో తేల్చేదాకా వదిలిపెట్టం. ఆ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడికి ఏ సంబంధం లేదని శ్రీధర్ బాబు అంటున్నడు. ఛైర్మన్ అనుముల కొండల్ రెడ్డి అని వాళ్లే ప్రొఫైల్లో రాసుకున్నరు. కానీ మంత్రి శ్రీధర్ బాబు సిగ్గులేకుండా బుకాయిస్తున్నరు. అసలు ఇవన్నీ మంత్రికి తెలిసి జరుగుతున్నాయా? మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలుస్తుందా శ్రీధర్ బాబు గారు? ఈ భూకేటాయింపుల కుంభకోణంలో ఎవరినీ వదిలిపెట్టం. ముఖ్యమంత్రి సోదరులైతే ఏమైనా చేయొచ్చా? సీఎం అన్న తిరుపతి రెడ్డికి ఏ అధికారిక హోదా ఉంది? కలెక్టర్లు, ఎస్పీలు ఆయనకు వంగివంగి దండాలు పెడుతున్నరని అన్నారు.

## పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్

- మొదటి పేజీ తరువాయి

ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- మొదటి పేజీ తరువాయి

చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు.

**జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలి..**

తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. మధ్యవర్తుల జోక్యానికి తావులేకుండా నేరుగా పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ మరింత సరళీకరణ చేస్తున్నట్లు వివరించారు. అధిక దిగుబడి రైతులకు వెంటనే డిజిటల్ "అవశ్రీఁ జవతీఱటఱఝవం ఇస్తున్నట్లు వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల్లో నాణ్యత పరీక్ష పరికరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

**సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..**

కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తుమ్మల చెప్పారు. రద్దీ, పెండింగ్ ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు ఫిర్యాదులు చేయడానికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్: 1800 599 5779, వాట్సాప్ చాట్‌బాట్: 88972 81111లో సంప్రదించాలని సూచించారు. అన్నదాతకు ఎంఎస్పీ ధర అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

వార్తాతరంగాలు

బుధవారం 12 ఆగస్టు 2026

# పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి...

**ప్రధానికి వీహెచ్ లేఖ**



**న్యూఢిల్లీ, ఆగస్టు :** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడుకి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం(త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు. ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం.. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. తెలుగు రాష్ట్రానికి పింగళి వెంకయ్య సేవలను మోదీ ఎందుకు మరచిపోయారో అర్థం కావడం లేదని తెలిపారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు. 'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

# రాజీవ్ రహదారి బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**

**ఖార్ఖానాలో రాజీవ్ రహదారి బాధితుల ఆందోళనకు మద్దతు**



రాజీవ్ రహదారి విస్తరణ ప్రాజెక్టులో భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఖార్ఖానాలో బాధితులు నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొని వారికి బీజేపీ తరఫున సంఘీభావం తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం భూములు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం కోసం చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు అందరూ సహకరిస్తున్నారని, అయితే తమ ఆస్తులను త్యాగం చేస్తున్న ప్రజలకు సరైన విలువతో కూడిన న్యాయమైన పరిహారం అందాల్సిన అవసరం ఉందన్నారు. తూంకుంట ప్రాంతంలో భూముల పరిహారాన్ని పెంచిన విధంగా, రాజీవ్ రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న ఖార్ఖానా ప్రాంత ప్రజలకు కూడా తగిన మేర పరిహారం పెంచాలని ఆయన కోరారు. తూనికుంటలో పెంచిన పరిహారం కంటే ఈ ప్రాంతం మరింత ఖరీదైన అర్బన్ ప్రాంతమని, అలాంటి పరిస్థితుల్లో ఇక్కడ తక్కువ పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తూంకుంటలో ఏ మేరకు పరిహారం పెంచిందో, అదే విధంగా ఇక్కడ కూడా సముచితమైన శాతం మేర పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనం కోసం తమ భూములు, ఇళ్లు, ఆస్తులను త్యాగం చేస్తున్న బాధితుల త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించాలని, వారికి న్యాయమైన పరిహారం అందించడం ద్వారా వారి పట్ల న్యాయం చేయాలని ఆయన అన్నారు. బాధితులు చేస్తున్న న్యాయమైన డిమాండ్‌కు భారతీయ జనతా పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**: దామోదర రాజనర్సింహ**



**హైదరాబాద్, ఆగస్టు 11**: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు (బుధవారం) భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపు ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

# అంతస్తులతో ట్రాంప్ టవర్లు

**హైదరాబాద్:**నగరంలోని కోకాపేటలో ట్రంప్ టవర్స్ నిర్మించనున్నారు. 65 అంతస్తులతో రెండు టవర్ల నిర్మాణం జరగనుంది. ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు సంయుక్తంగా వీటి నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నాయి. ఈ టవర్లలో అతి ఖరీదైన 450 ఫ్లాట్లు ఉండనున్నాయి. ట్రంప్ టవర్స్కు ఇప్పటికే రెరా అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి త్వరలో జరిగే భూమి పూజకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. మూడేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్న ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు వెల్లడించాయి.

# 71 లక్షల మంది ఓట్ల తొలగింపు..

## ముగిసిన ఎస్ఐఆర్ డెడ్‌లైన్.. తుది జాబితాపై తీవ్ర ఉత్కంఠ!


**హైదరాబాద్, ఆగస్టు 11:**తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 3.38 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 71 లక్షల మంది ఓటర్లు అన్‌కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగానికి పైగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నట్లు వెల్లడైంది. ఇక నేటితో ఎస్ఐఆర్ గడువు ముగియడంతో ఇప్పుడు ఫారాల పరిశీలన, ధ్రువీకరణ అనంతరం తుది ఓటర్ల జాబితా ఎలా ఉండబోతోందన్న దానిపై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువు ముగిసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 71 లక్షల మంది ఓటర్ల వివరాలపై ఇప్పుడు తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఓటర్లను అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన నేపథ్యంలో.. తుది ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కొనసాగుతాయా లేక తొలగిస్తారా అనేది కీలకంగా మారింది. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. సుమారు 70.8 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని లేదా సేకరించలేని కేటగిరీలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి.ఈ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 21 శాతానికి సమానమని ఎన్నికల సంఘయి గణాంకాలు పేర్కొంటున్నాయి. వీరిలో సుమారు 9.1 లక్షల మంది మరణించినవారు ఉండగా.. 10.3 లక్షల మంది గైర్హాజరు లేదా ఆచూకీ లభించని వారిగా గుర్తించారు. మరో 43 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు.. 6.6 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఇప్పటికే అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వచ్చే ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ ఉంటుందని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే గడువు ముగియగా..




ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి మరిన్ని ఎన్యుమరేషన్ ఫారాలు అందే అవకాశం ఉండటంతో తుది తొలగింపు సంఖ్యలో మార్పు రావచ్చని భావిస్తున్నారు. ఆగస్ట్ 9వ తేదీ నాటికి సుమారు 3.2 లక్షల ఫారాలు మాత్రమే డిజిటలైజ్ కావాల్సి ఉండగా.. మిగిలిన ప్రక్రియను అధికారులు పూర్తి చేయనున్నారు.ఎస్ఐఆర్‌లో అత్యధికంగా అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదైన ప్రాంతంగా గ్రేటర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలు కలిపి సుమారు 41.5 లక్షల అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70.8 లక్షలతో పోలిస్తే ఇవి దాదాపు 58.6 శాతానికి సమానం.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను సేకరించడంలో అనేక ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. అద్దె ఇళ్లలో ఉండేవారు తరచూ ఇళ్లను మార్చడం.. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం.. మూసివేసిన ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఓటర్లను గుర్తించడం కష్టంగా ఉండటం, మరణించిన ఓటర్ల పేర్లు కొనసాగడం వంటి కారణాలు అన్‌కలెక్టబుల్ కేసులు పెరగడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణలో ఓటర్ల వివరాల్లో అనామలీస్ (వివరాల్లో తేడా ఉండటం) శాతం ఎక్కువగా నమోదైంది. జిల్లా స్థాయిలో ఆదిలాబాద్‌లో 28.5 శాతం ఓటర్ల వివరాల్లో అనామలీస్ గుర్తించారు. నిజామాబాద్‌లో 27.4 శాతం, నిర్మల్‌లో 26.1 శాతం, మెదక్‌లో 24.6 శాతం, కామారెడ్డిలో 23.9 శాతం, సంగారెడ్డిలో 23.8 శాతం నమోదు అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌లో 30.4 శాతం అనామలీస్‌తో అత్యధికంగా ఉండగా.. నారాయణఖేడ్‌లో 29.3 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 28.4 శాతం, షాద్‌నగర్‌లో 28.3 శాతం, నిర్మల్‌లో 28.29 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 28.1 శాతం నమోదయ్యాయి.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు సుమారు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి.. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ధ్రువీకరించినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.1 శాతానికి సమానం. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ముగియడంతో ఇప్పుడు అధికారుల తదుపరి చర్యలపై దృష్టి నెలకొంది. ఇప్పటికే అందిన ఫారాల పరిశీలన, డేటా ధ్రువీకరణ, అభ్యంతరాలు–దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియల తర్వాతే తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది స్పష్టమవుతుంది.మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా అన్‌కలెక్టబుల్ కేసులు.. ఉత్తర–పశ్చిమ తెలంగాణలో అధిక అనామలీస్ నమోదైన నేపథ్యంలో.. ఎస్ఐఆర్ తుది ఫలితాలు రాష్ట్ర ఓటర్ల జాబితాపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని అర్థమవుతోంది. ప్రస్తుతం 71 లక్షలుగా ఉన్న అన్‌కలెక్టబుల్ ఓటర్ల సంఖ్యలో చివరకు ఎంతమంది పేర్లు తొలగింపునకు గురవుతాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

# బీఆర్ఎస్ పార్టీని ఆక్రమించడమే లక్ష్యంగా బీజేపీ

**వరంగల్ ఆగస్టు 11:**తెలంగాణలో సంచలనాలు సృష్టించేందుకు బీజేపీ పదునైన వ్యూహానికి పదును పెట్టింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఒక కీలక ఉన్నత స్థాయి భేటీలో, తెలంగాణ కమలనాథులకు పార్టీ అధిష్ఠానం అత్యంత స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. పదేళ్ల పాటు అధికారంలో ఉండి, విపక్షంలోకి వెళ్లాక తీవ్రమైన సవాళ్లతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీని సంపూర్ణంగా ఆక్రమించడమే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది. గులాబీ పార్టీ నైతిక ధైర్యం దెబ్బతీసి, తెలంగాణలో ఇకపై కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్యనే పోరాటం సాగాలని దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు పార్టీ కేడర్ పనిచేయాలని స్పష్టం చేసింది.ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బీఆర్ఎస్ ఎక్కడైతే వెనకబడుతోందో, ఆ ప్రతికూలతనే తమ రాజకీయ అవకాశంగా మలుచుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ప్రజాపోరాటాల్లో బీఆర్ఎస్‌కు ఎలాంటి మైలేజ్ దక్కకుండా చెక్ పెడుతూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక నిజమైన విపక్షం తమదేనని నిరూపించుకోవాలని భావిస్తోంది. విద్యార్థులు, రైతులు, చేతివృత్తుల వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, ఆరు గ్యారెంటీలు, రైతు రుణాలు, నిరుద్యోగ భృతి, మహిళా




పథకాల అమలులో క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతున్న అసంతృప్తిని క్షేత్రస్థాయి ఆందోళనల ద్వారా ఆయుధంగా మలచుకోవాలని అధిష్ఠానం పిలుపునిచ్చింది. కాంగ్రెస్ హామీలు ఉత్తుత్తివేనని, ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ మోడల్ మాత్రమే శాశ్వతమని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన్ ఎజెండాకొంతకాలంగా తెలంగాణ బీజేపీని వేధిస్తున్న అంతర్గత విభేదాలపై కేంద్ర నాయకత్వం సీరియస్ క్లాస్ తీసుకుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కమిటీ సభ్యులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యాఖ్యలను పక్కనబెట్టి ఒకే టీమ్‌గా పనిచేయాలని స్పష్టం చేసింది. ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకుంటే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పిన నేతలు, సమష్టి నాయకత్వంతో పోరాడితేనే 2028లో అధికార పీఠం సాధ్యమవుతుందని మార్గదర్శనం చేశారు.కేవలం అర్బన్ ఏరియాలకే పరిమితం కాకుండా గ్రామ పంచాయతీల నుంచి పార్టీ నెట్‌వర్క్‌ను బలపరచాలని ఆదేశించారు. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావించి సమరశంఖం పూరించనున్నారు. మత ఆధారిత రిజర్వేషన్లు, ముస్లిం ఓటు బ్యాంక్ రాజకీయంపై కాంగ్రెస్‌ను నిలదీస్తూనే, సనాతన ధర్మ పరిరక్షణను ఎజెండాగా మార్చుకోవాలని సూచించారు. అదే సమయంలో కేంద్రం నుంచి తెలంగాణకు అందిన ఎయిమ్స్, కాజీపేట వ్యాగన్ తయారీ యూనిట్, ఎలివేటెడ్ కారిడార్లు, జాతీయ రహదారుల నిధుల వివరాలను గడపగడపకూ చేరవేయనున్నారు.ఈ ఢిల్లీ భేటీతో తెలంగాణలో బీజేపీ వ్యూహం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. బీఆర్ఎస్‌ను గతంగానూ, కాంగ్రెస్‌ను వైఫల్యంగానూ చిత్రీకరిస్తూ.. బీజేపీ మాత్రమే రాష్ట్ర భవిష్యత్తు అనే నరేటివ్‌ను బలంగా తీసుకెళ్లాలని కమల దళం యుద్ధానికి సిద్ధమవుతోంది.

# కార్పొరేట్ పాఠశాలలా.. కబళించే స్కూళ్లా..?

**హైదరాబాద్, ఆగస్టు 11:**ఉత్తమమైన విద్య అందుతుందని.. ఉపాధ్యాయులు మెరుగ్గా బోధన చేస్తారని.. తమ పిల్లలు ప్రయోజకులవుతారని చాలామంది తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తుంటారు. అప్పులు తెచ్చి అయినా సరే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు.ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు ఉండవని.. ఉపాధ్యాయులలో జవాబుదారితనం కనిపించదని.. పిల్లలకు సక్రమమైన విద్య అందదని భావించే తల్లిదండ్రులు.. తమ స్తోమతకు మించినా సరే పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడి.. విద్యార్థులకు ఉత్తమమైన విద్య అందించి.. మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ.. విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి.యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. పైగా ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగాను మెలగాల్సిన చోట దారుణంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న దమ్మాయిగూడ లో శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల మధ్య ర్యాగింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక పదవ తరగతి విద్యార్థిని తోటి విద్యార్థులు కర్రలతో కొట్టారు. బూటు కాళ్లతో తన్నారు.. ఈ విషయం ఆ విద్యార్థి తల్లిదండ్రుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థుల దాడిలో గాయపడిన అభిషేక్ అనే విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఈ వ్యవహారాన్ని ఆసుపత్రి యాజమాన్యం మరో విధంగా




చిత్రీకరించడం మొదలుపెట్టింది. ఆ విద్యార్థి మెట్లపై నుంచి పడినట్టు చెబుతోంది. వాస్తవానికి విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండేలాగా యాజమాన్యం కృషి చేయాలి. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం బాటలు పరచాలి. తోటి విద్యార్థుల మధ్య ఈ స్థాయిలో ర్యాగింగ్ జరిగింది అంటే అది ముమ్మాటికి యాజమాన్యం నిర్లక్ష్యమే.ఉన్నతమైన చదువులు చెప్తారని శ్రీ చైతన్య లో చేర్పించాం. భారీగా ఫీజులు కూడా చెల్లిస్తున్నాం. అయినప్పటికీ ఇక్కడ విద్యార్థులకు సరైన సెక్యూరిటీ లేదు. తోటి విద్యార్థులు ఒకరిని ఒకరు కొట్టుకుంటుంటే మేనేజ్మెంట్ ఏం చేస్తోంది.. విద్యార్థులను పర్యవేక్షించాలి కదా.. నిత్యం కనిపెట్టుకొని ఉండాలి కదా. ఇంతలా దాడులు చేసుకున్నారంటే ఏమనుకోవాలి.. ర్యాగింగ్ విష సంస్కృతి ఈ స్థాయిలో పెచ్చరిల్లిపోతుంటే మేనేజ్మెంట్ నిశ్శబ్దంగా ఉంది.. మా అబ్బాయి పరిస్థితి చూస్తే దారుణంగా ఉందని అభిషేక్ తల్లిదండ్రులు చెప్తున్నారు. మరి దీనిపై యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు.

# పంజాగుట్ట శ్మశానవాటికలో కలకలం..

**చిన్నారి మృతదేహం అదృశ్యం**



పురిట్లోనే కవల పిల్లలను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న దంపతులకు శ్మశానవాటికలో ఊహించని షాక్ తగిలింది. ఖననం చేసిన ఒక పసిపాప మృతదేహం మాయమైన ఘటన హైదరాబాద్‌లోని పంజాగుట్ట శ్మశానవాటికలో తీవ్ర కలకలం రేపింది. చార్మినార్ ఘాన్సీ బజార్‌కు చెందిన దంపతులకు ఆరు నెలల క్రితం నెలలు నిండకుండానే కవల పిల్లలు జన్మించారు. తీవ్ర అనారోగ్యంతో బంజారాహిల్స్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఒక శిశువు మరణించగా, కుటుంబసభ్యులు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు. తీరా మరుసటి రోజే (ఆదివారం) రెండో శిశువు కూడా కన్నుమూయడంతో, ఆ మృతదేహాన్ని కూడా పూడ్చిపెట్టేందుకు అదే శ్మశానవాటికకు వెళ్లిన తల్లిదండ్రులకు దిగ్భ్రాంతి కలిగించే దృశ్యం ఎదురైంది. క్రితం రోజే తవ్విన గొయ్యి తెరిచి ఉండటం, లోపల ఉన్న మొదటి శిశువు మృతదేహం కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. మృతదేహం ఏమైందని అక్కడ పనిచేసే శ్మశానవాటిక సిబ్బందిని ప్రశ్నించగా వారి నుంచి ఎలాంటి సరైన సమాధానం రాకపోవడంతో, బాధితులు వెంటనే బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. అందులో భాగంగా శ్మశానవాటిక కాటికాపరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అసలు ఆ మృతదేహాన్ని కుక్కలు ఏమైనా లాక్కెళ్లాయా లేదా ఏదైనా దురాగతానికి ఒడిగట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

వార్తాతరంగాలు



# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు...

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




**జోగులాంబ గద్వాల, ఆగస్టు (11 స్కై న్యూస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, పారిశుధ్యం, త్రాగు నీరు, సీటింగ్, తదితర ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశంసాపత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగుల పేర్లతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువు లోపు పంపించాలని ఆదేశించారు.ప్రభుత్వం ఈనెల 15 నుంచి అర్హులైన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేసేందుకు నిర్ణయించినందున సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కొత్తగా చేయూత పెన్షన్లను కూడా అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పెన్షన్ల కోసం ఇదివరకు దరఖాస్తు చేసుకున్న వాళ్లు ప్రస్తుతం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 31వ తేదీలోగా అర్హులైన వారందరూ పెన్షన్ల కోసం సంబంధిత వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేయడంలో అలసత్వం చూపకుండా నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌ను తిప్పి పంపడం దుర్మార్గం

**రైతాంగానికి అన్యాయం జరిగితే పాలకులు శాశ్వత ద్రోహులుగా మిగిలిపోతారు**

**పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కన్వీనర్ టీజీ శ్రీనివాస్**



**రంగారెడ్డి జిల్లా , ఆగస్టు 11 (స్కై న్యూస్):** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం తిప్పి పంపడం దుర్మార్గమని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ షాద్‌నగర్ శాఖ కన్వీనర్ టీజీ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు ప్రాంత రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు అనుమతులు, జాతీయ హోదా కల్పిస్తున్న కేంద్రం తెలంగాణకు కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం సమంజసం కాదన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల విషయంలో ఇప్పటికే పురోగతి సాధించామని, నీటి కేటాయింపులకు సంబంధించిన అంశాలను సంబంధిత ట్రిబ్యునల్ పరిధిలో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. తెలంగాణకు కేటాయించిన నీటి వాటా నుంచి పాలమూరు-రంగారెడ్డి పథకానికి 90 టీఎంసీలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందన్నారు. డీపీఆర్ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపాలని టీజీ శ్రీనివాస్ కోరారు. తెలంగాణ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కోసం గళమెత్తాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగానికి సాగునీరు అందించడంలో జాప్యం చేస్తే తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రాజెక్టు సాధన కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతాంగానికి అన్యాయం జరిగితే సంబంధిత పాలకులు చరిత్రలో శాశ్వత ద్రోహులుగా మిగిలిపోతారని టీజీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 11(స్కై న్యూస్):** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, ఎన్నికల ఉప తహసిల్దార్ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త అరుణ్ మృతి బాధాకరం

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అరుణ్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ అన్నారు. అరుణ్ మృతి విషయం తెలుసుకున్న ఆయన షాద్‌నగర్ చేరుకుని పార్థీవదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ కోసం అరుణ్ అందించిన సేవలను రవీందర్ యాదవ్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అరుణ్ మృతి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు బీఆర్ఎస్ శ్రేణులకు తీరని లోటని అన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, అరుణ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డుకు జీవో 641 రద్దు చేయాలి

**బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్ధాపూర్‌లో భారీగా చెత్తను డంప్ చేయడం వల్ల భూగర్భజలాలు, గాలి కలుషితమై ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలపై చెత్త భారం మోపడం సరికాదని, ప్రజల మనోభావాలను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు జీవో నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రవీందర్ యాదవ్ హెచ్చరించారు.

## మూగ జీవాలకు మెరుగైన సేవలు అందించాలి...

**రైతుల జీవనోపాధిలో పశుసంపద కీలకం**

**జిల్లా కలకలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ తిమ్మాజీపేట ఆగస్టు 11 (స్కైన్యూస్)** రైతుల జీవనోపాధిలో కీలకమైన పశు సంపదను కాపాడేందుకు మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంతా కేశవ్ పాటిల్ ఆదేశించారు మంగళవారం నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు రికార్డులను పరిశీలించి మూగ జీవాల సంఖ్య వాటి వివరాలను రైతుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. నిరంతరం పశు వైద్య సేవలపై అధికారులు పర్యవేక్షణ జరిపించాలని ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు పరికరాలు ఇతర వివరాలను తెలుసుకున్నారు పశువులకు వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న వివిధ పథకాలు సేవలు టీకా కార్యక్రమాలు పశుపోషణకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పాండు తిమ్మాజీపేట సర్పంచ్ కవిత తో పాటు పశువైద్యాధికారులు



వివిధ శాఖల మండల అధికారులు రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## షాద్‌నగర్‌లో పలువురి మృతికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సంతాపం



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల పార్థీవదేహాలకు నివాళులర్పించారు. పద్మావతి కాలనీకి చెందిన అరుణ్ గౌడ్, మొత్కూలగూడ బీఆర్ఎస్ వార్డు సభ్యుడు శివ మాతృమూర్తి లక్ష్మమ్మ, శ్రీనివాసులగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జగన్ రెడ్డి సతీమణి సంతోష మృతికి ఆయన సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్, కౌన్సిలర్ బీఎస్ సుధీర్, మాజీ ఎంపీటీసీ కాట్నా రవీందర్, మొత్కూలగూడ సర్పంచ్ లావణ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన వైస్ చైర్మన్ మాల శ్రీనివాస్‌కు ఘన సన్మానం




**గద్వాల ఆగస్టు 11((స్కై న్యూస్)::**జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని దళిత కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన మాల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్, జిల్లాదళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు దాగే పోగు వెంకటన్న, టిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ మన్నపురం రాముడు, వేణుగోపాల్ తదితర మిత్రబృందం పాల్గొని మాల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో మాల శ్రీనివాస్ మరింత సమర్ధవంతంగా పనిచేసి దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు లభించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ కార్యకర్త మృతికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సంతాపం



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త క్యాత్రమోని బాలకృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబానికి స్థానిక నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈ. చంద్రయ్య, కే. నర్సింలు, కే. వెంకటేష్, డి. చంద్రయ్య, కే. జంగయ్య, కే. అచ్చన్న, కే. రామచంద్రయ్య, కే. మల్లేష్, ఈసారి చిన్న కిష్టయ్య, కే. భీమయ్య తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

## కోరిన కోరికలు తీర్చే శ్రీ తిమ్మప్ప స్వామి



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 11 (స్కై న్యూస్):**భక్తుల కొంగుబంగారం కూడిన కోరికలు తీర్చే శ్రీ తిమ్మప్ప స్వామి దయ అందరిపై ఉండాలని ప్రముఖ గాయకుడు గద్వాల చంద్రశేఖర రావు తెలిపారు. ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 8న ప్రారంభమైన అఖండ సప్తాహ భజన కార్యక్రమం నాలుగవ రోజు మంగళవారం ఆయన హాజరై అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి భజన మండలి సభ్యులను ఉత్తేజపరిచారు. అంతకుముందు ఆయన దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి ఆయనకు స్వామివారి శేష వస్త్రం బహుకరించారు. నాలుగవ రోజు పచ్చర్ల నీలిపల్లి శ్రద్ధలోనిపల్లి ఉత్తనూరు తుపత్రాల గ్రామ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## బసవేశ్వర విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆహ్వానం



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 13న నిర్వహించనున్న విశ్వగురు బసవేశ్వరుని విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, సమాజ అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్, సీనియర్ పాత్రికేయుడు లక్కాకుల రమేష్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వార్తాతరంగాలు
బుధవారం 12 ఆగస్టు 2026

# స్వామీజీల ఆశీస్సులు అందుకున్న అరవింద రావు



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 11 (స్కై న్యూస్):**మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శుభుదేంద్ర తీర్థ స్వామిజి14వ చతుర్మాశ్య సందర్భంగా మల్దకల్ పట్వారి అరవిందరావు స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ మేరకు మంత్రాలయం వెళ్లి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీకి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలోశ్రీ శ్రీ శ్రీ ఉడిపి పలిమారు మఠం స్వామీజీ శ్రీశ్రీశ్రీ విద్యా దీశ తీర్థ స్వామీజీవారి 48 వ చతుర్మాస్య దీక్ష సందర్భంగా వారి ఆశీస్సులు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర దాస్, మల్లెం దొడ్డి రాఘవేంద్ర దాస్, రమేష్ చారి, బాబురావు, డాక్టర్ ఎస్ టి శంకర్ తదితరులు ఉన్నారు.

# గద్వాల మండలం కొండపల్లి ప్రభుత్వ పాఠశాలో దొంగలభీభత్సం

**బీరువాలు ధ్వంసం**

**తాగుబోతుల పనా లేక దొంగల పనా అనేది తెలియాల్సి ఉంది.**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 11 (స్కై న్యూస్):**గద్వాల మండల కొండపల్లి ప్రాథమిక పాఠశాలలలో గుర్తు తెలుయని వ్యక్తులు భీభత్సం సృష్టించారు. పాఠశాల ఆఫీస్ గది తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన వ్యక్తులు అక్కడ ఉన్న బీరువాలను పగలగొట్టి ధ్వంసం చేశారు. పాఠశాలకు వరుస సెలువులు ఉండటంతో ఈ ఘటన చోటు చేసుకుంది. మంగళవారం పాఠశాల పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వచ్చిన ఉపాద్యాయులు జరిగిన సంఘటనను చూసి ఆందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించారు.

# డిపిఓ కి వినతి పత్రం అందజేసిన పిసా మొబిలైజర్స్

**డిపిఓ ని ఘనంగా సత్కరించిన పిసా మొబిలైజర్స్**



**కొత్తగూడెం ఆగస్ట్ 11( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి అనూష నీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువతో సత్కరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పిసా మొబిలైజర్స్. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పిసా మొబిలైజర్ పాల్గొన్నారు.పెండింగ్ వేతనాలు 8 నెలల నుంచి రావలసి ఉన్నదని కొన్ని సంవత్సరాల నుండి చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని కనీసం వేతనము 18 వేల రూపాయలు ఇవ్వాలని వేడుకుంటున్నామని మా యొక్క డిమాండ్ ప్రభుత్వానికి తమరి ద్వారా తెలియజేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇస్లావత్ లాలు వజ్జా రమణ వీణ రావు పుల్లారావు రమేషు సబిత ఈసం పద్మ పార్వతి సిహెచ్ వెంకటేశ్వర్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# హర్ ఘర్ తిరంగా ర్యాలీలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య




**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** నవాబ్‌పేట్ మండల కేంద్రంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తిని చాటుతూ జాతీయ సమైక్యత, దేశాభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# ఎస్ ఎస్ కే సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆషాఢ ఉత్సవాలు



**నారాయణపేట ఆగస్టు 11: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో మంగళవారం ఆషాఢమాసం ఆఖరి ఉత్స వాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పోలకమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. బోనాలు సమర్పిం చారు. అమ్మవారికి మేకలు గోర్లు,కోళ్ళను బలిచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కే సమాజ్ పెద్దలు పాల్గొ న్నారు.

## విజయవంతంగా ముగిసిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్

# విజన్ 2034 ఏకో వర్క్ షాప్





**హైద్రాబాద్ ఆగస్ట్ 11:**తెలంగాణ రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో విజన్ 2034 ఏకో వర్క్ షాప్ భవిష్యత్ కోసం వ్యూహాత్మక ప్రణాళిక పై రెండు రోజులపాటు రాష్ట్ర ట్రైనింగ్ సెంటర్, జీడిమెట్లలో జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సోమనాథ్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి ఉద్దేశించి ముఖ్యంగా ఈ ప్రోగ్రామ్ ప్రధానంగా కార్య చరణ ప్రణాళికను రూపొందించుకోవడం తో పాటు భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ,సభ్యుల సంఖ్యను , యూనిట్ లను పెంచుకోవడం,నాయకత్వాన్ని పెంపొందించుకోవడం,నిర్దేశించుకున్న లక్ష్యాలను రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయిలకు విది విధానాలనూ రూపోశీదించుకోవడం కోసం ఈ పది సంహత్సరముల్లో సంస్థను బలోపేతం చేయడానికి ,ఋరూపొందించిన ముఖ్యమైన కార్యక్రమమని , జాతీయ హెడ్ క్వార్టర్ నుండి ప్రత్యేక ఆహ్వానం, విజ్ఞప్తి మేరకు విచ్చేసిన రిసోర్స్ పర్సన్ డాక్టర్ బి. రమేష్ పట్నాయక్ పర్యవేక్షణలో, డాక్టర్ D R K శర్మ ముఖ్య సలహాలతో ఈ కార్యక్రమమును నిర్వహించడం జరుగుతుందని వారికి ప్రత్యేక హృదయాభి వందనములు తెలియ చేశారు,ఈ సందర్భంగా రాష్ట్ర దీా+ ఇచ్చిన పిలుపుతో అన్ని జిల్లా ల నుండి వచ్చిన స్కౌట్ మాస్టర్ అండ్ గైడ్ కెప్టెన్ జిల్లా ముఖ్య నిర్వాహక సభ్యులందరికీ ప్రత్యేకంగా అభినందించారు , ఈ కార్యక్రమానికి వారితోపాటు రాష్ట్ర ఆర్గనైజర్ కమిషనర్ స్కౌట్స్ ు.పరమేశ్వర్ , డాక్టర్ ప్రమోదినీ , +. వెంకట్ రెడ్డి,జాన్ శ్యామ్యుల్ గారు,రామ్ మోహన్ ,అమర జ్యోతి వెంకటేశ్వర్లు , సాయి నిరంజన్ , సాంకేతిక నిపుణులు గ్రీష్మ చంద్రికా, ప్రవీణ్ లు విచ్చేశారు,మన హైద్రాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ తరుపున మన వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హమీద్ ,సెక్రటరీ వి. లక్ష్మణ్ నాయక్ , డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్, యన్. కరుణాకర్ ,జిల్లా స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ వి. రాములు నాయక్ గారు, గైడ్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.అనితా గారు , జిల్లా కమిషనర్ వి. హేమలత , అకౌంట్ సెక్షన్ మమత, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు , ఈ సందర్భంగా హైద్రాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఈ అవకాశము కల్పించినందుకు, రాష్ట్ర ట్రెజరీ రాజగోపాల్ సార్ గారికి ,రాష్ట్ర చీఫ్ కమిషనర్ దాన కిశోర్, మరియు రాష్ట్ర దీా+ డైనమిక్ సెక్రటరీ అయినా డాక్టర్ నవీన్ నికోలస్ సార్ గారికి హైద్రాబాద్ జిల్లా పక్షాన హృదయపూర్వక అభినందనలు తెలియచేశారు. భవిష్యత్ లో హైద్రాబాద్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను అధికారుల సహకారముతో వేగవంతముగా నిర్వహించుకుంటామని , ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మరియు చీఫ్ కమిషనర్ అయినా యాదయ్య గారికీ ప్రత్యేక హృదయభి వందనములు తెలియ చేస్తూ కృతజ్ఞతలు తెలియ చేశారు.వారి సహకారం తో జిల్లా లో నీ ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాల ఉపాధ్యాయులు అనేకమంది కొత్తగా ట్రైనింగ్ తీసుకోవడం జరిగింది, ఉపవిధ్యాధికారి బండ్లగూడ మండలం బి.వెంకటేశ్వర్లు జిల్లా కమిషనర్ స్కౌట్ గారికి ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు.

# సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

**డీఎస్పీ లింగయ్య**




**నారాయణపేట ఆగస్టు 11:( స్కైన్యూస్)** సైబర్ నేరాలు,డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట డీఎస్పీ నల్లపూ లింగయ్య అన్నా రు.మంగళవారంమన ఊరు -- మన పోలీస్ కార్య క్రమంలో భాగంగా డీఎస్పీ నల్లపు లింగయ్య నారాయ ణపేట మండలం లింగం పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమా లు, ప్రజల భద్రతకు తీసు కుంటున్న చర్యలపై అవగా హన కల్పించారు. ఈ సంద ర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ వాల్ ప్రాధా న్యతను డీఎస్పీ వివరిం చారు. ప్రజలకు పోలీస్ శాఖతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా, గ్రామాల్లో శాంతిభద్రతలు, చట్టపరమైన అంశాలు, ప్రజల భద్రతకు సంబంధిం చిన సమాచారాన్ని చేర వేయడంలో పోలీస్ వాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండా లని సూచించారు. అపరి చిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, బ్యాంకింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ టి పి,పిన్,సి వి వి బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వ ర్డ్‌లు ఇతరులకు వెల్లడించ వద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు సమా చారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడం, ప్రజల భద్రత ను మరింత పటిష్టం చేయ డంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ తెలిపారు. ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదా రులు, రద్దీ ప్రాంతాలు, గ్రామ ప్రవేశ-- నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావా లని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు గ్రామ ప్రజలు సహకరించా లని డీఎస్పీ కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. పోలీసులకు ప్రజలు సహకరిస్తే గ్రామాల్లో నేరాలను మరింత సమ ర్థవంతంగా నియంత్రించ వచ్చు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవ గాహన కలిగి ఉండి, ఇత రులకు కూడా అవగాహన కల్పించాలి అని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్సై సతీష్ రెడ్డి, పోలీ స్ సిబ్బంది, లింగంపల్లి గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా మంత్రి వాకిటి శ్రీహరి

## 4.21 లక్షలకుపైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా

## ప్రమాదవశాత్తు మరణం, వికలాంగతకు రూ.5 లక్షల వరకు బీమా రక్షణ

## మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత: మంత్రి వాకిటి శ్రీహరి



**ఉట్కూర్ ఆగస్టు 11 ( స్కై న్యూస్):**2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఢ క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2026-27 సంవత్సరంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.

**బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు:**

1. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే -- రూ.5.00 లక్షలు
2. శాశ్వత సంపూర్ణ వైకల్యానికి -- రూ.5.00 లక్షలు
3. శాశ్వత పాక్షిక వైకల్యానికి -- రూ.2.50 లక్షలు
4. ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందితే -- గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం

2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# ప్రతి ఇంటిపై జెండా ఎగురెద్దాం...

**బిజెపి నేత మల్లేష్**



**నారాయణపేట ఆగస్టు 11:( స్కై న్యూస్)**ఘర్ ఘర్ తిరంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన సందర్భంగా మంగళవారం నారాయణపేట బిజెపి నాయకులు డి.మల్లేష్ జాతీయ జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం స్వతంత్ర ఉద్యమం నాటికి దేశంలో దాదాపు 10 కోట్ల మంది భారతీయులు తమ తమ ఇళ్లపై 15 ఆగస్టు నాడు మరి అంతకు ముందు మూడు రోజులు జాతీయ జెండాను ఆవిష్కరించి కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడ్డరని అన్నారు. ఆ పిలుపుకు కొనసాగింపుగా ఈ సంవత్సరము ""1942 ఆగస్టు 9న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం"" స్ఫూర్తితో ఆగస్టు 9 నుండి 17 ఆగస్టు వరకు దేశవ్యా ప్తంగా ప్రతి ఊరిలో ప్రతి ఇంటి పై భారత జాతీయ జెండాను ఎగురవేసి జాతీ య స్ఫూర్తిని పెంపొందించా లని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు 10వ తేదీ నుండి 15 ఆగస్టు వరకు ప్రతి ఒక్కరూ ఈ ""పూర్వ జెండా ప్రతి ఇంటి పై జెండా"" ఎగరాలని కోరారు. ఇదే స్ఫూర్తితో నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు ప్రతి పల్లెలో ప్రతి ఇంటి పైన జెండాను ఎగుర వేయవల సిందిగా భారతీయులం దరినీ కోరినారు. ఈ పిలుపును అమలు చేసి దేశద్రోహుల ఆట కట్టివే యాలని ప్రతి ఒక్కరిలో జాతీయ జెండాపై భక్తిని పెంచాలని దేశభక్తిని రగి లించాలని జాతి పునర్ నిర్మాణంలో భాగస్వా ములు కావాలని రాజకీ యాలకు అతీతంగా ప్రతి భారతీయుడు ఈ స్వాతం త్ర దినోత్సవ శు భాకాంక్షలు జాతీయ జెండాలు ఎగుర వేసి మరొకసారి దేశభక్తి చాటుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రశ్నించే ప్రతి గొంతు కమ్యూనిజమే

**మార్పుకు ఎర్రజెండానే అసలైన దిక్సూచి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో జోరుగా సిపిఐ ప్రజాచైతన్య యాత్ర**







**చుంచుపల్లి ఆగస్ట్ 11( స్కై న్యూస్):** సమాజంలో ప్రశ్నించే ప్రతి గొంతులోనూ కమ్యూనిజం భావజాలం దాగి ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా చుంచుపల్లి మండల కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎండి రజబ్ అలీ స్థూపానికి పూలమాలవేసి నివాళు లర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చుంచుపల్లి, సుజాతనగర్ మండల కేంద్రాల్లో జరిగిన చైతన్య యాత్ర యాత్రల బహిరంగ సభల్లో అయన మాట్లాడారు. సమాజ పరిణామాలపై అవగాహన పెంచి ప్రజలను చైతన్యపరిచే శక్తి ఒక్క కమ్యూనిస్టులకే ఉందన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మంది విద్యార్థులు, యువత సాగించిన ఐక్య ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. కష్టపడి చదివిన యువతకు ఉపాధి కల్పించకుండా వరుస పేపర్ లీకేజీలతో వారి భవిష్యత్తుతో ఆడుకోవడం దారుణమన్నారు. దేశ సంపదంతా కొద్దిమంది బడా కార్పొరేట్ల చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని, రాత్రింబవళ్ళు శ్రమించే కార్మికులు, అన్నదాతలైన రైతులకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తూ కార్మిక చట్టాలను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. నింగినంటిన నిత్యావసరాల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందని, పంటలకు సరైన మద్దతు ధర లేక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చలి చీమలన్నీ ఐక్యమైతే విప్లవ సైన్యంగా మారినట్లే, బాధితులంతా ఏకమైతే ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని స్పష్టం చేశారు. దేశంలో సామాజిక, ఆర్థిక మార్పులకు ఎర్రజెండానే ఏకైక మార్గదర్శకమని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాలక నాయకుల్లో అహంభావం తగదని, అభివృద్ధికి సహకరించి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హితవు పలికారు. చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలో రవాణా సౌకర్యాల మెరుగుదలకు, రహదారులు, వంతెనలు ఇతర అభివృద్ధి పనులు మునుపెన్నడూ లేనివిధంగా జరుగుతున్నాయని, ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేస్తున్నామన్నారు. రెండు నెలల్లో కొత్తగూడెం కార్పొరేషన్తోపాటు కొత్తగూడెం నియోజకవర్గంలో మార్పు చూడబోతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యే ఉంటుందని, ఈ చైతన్య యాత్రల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ మున్ముందు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరిరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, డి వెంకన్న, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి వీరస్వామి, ఎస్ కే ఫహీం, యాత్ర బృందం సభ్యులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, రత్నకుమారి, ధనలక్ష్మి, షహీన్, షమీమ్, ఎండి యూసుఫ్, బోయిన విజయ్, బండి నర్సింహా, నిమ్మల రాంబాబు, కాటూరి రాము, మేదిని లక్ష్మి, దార లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస పోటీ కార్యక్రమం విజయవంతం చేయండి




**మక్తల్ ఆగస్టు 11( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం యాంకే పద్మ ఎం జె పి వి సి మక్తల్ అసెంబ్లీ మహిళా విభాగం అధ్యక్షురాలు మంగళవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో యాంకే పద్మ ఎం జె పి వి సి మక్తల్ అసెంబ్లీ మహిళ విభాగం అధ్యక్షురాలు ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాంతాలను సందర్శించి విద్యార్థిని విద్యార్థినిలకు పాఠశాలలకు వెళ్లి పర్యావరణ పరిరక్షణ గురించి యాంకే పద్మ వివరించడం జరిగింది ఈనెల 30/8/2026 జరగబోయే పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస కార్యక్రమం మక్తల్ ప్రాంతంలో ఉంటుంది అని అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థినిలకు పిలుపునిచ్చారు అనంతరం ముడుమల హై స్కూల్ గుండెబాల్లూరు హై స్కూల్ కృష్ణ హై స్కూల్ కూన్సీ హై స్కూల్ మగానుర్ హై స్కూల్ మక్తల్ బాయ్స్ హై స్కూల్ మక్తల్ గర్ల్స్ హై స్కూల్ మరియు మక్తల్ ప్రభుత్వం హై స్కూల్ లలో పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస పోటీ కార్యక్రమం గురించి వివరించడం జరిగింది అలాగే ప్రతి పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ ప్రచార పత్రం విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వీజీఎజ నాయకులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థినీయులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు



## పెద్దజట్రంలో తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక కృషి

**నీటి ఎద్దడి నివారణకు పైప్ లైన్ పనులు ప్రారంభం**



**ఊట్కూర్ ఆగస్టు 11 ( స్కై న్యూస్)** నారం పేట్ జిల్లా ఉట్కూరు మండలలోని పెద్ద జట్రం గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ వాకిటి వెంకటేష్ తెలిపారు. మంగళవారం గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టనున్న పైప్ లైన్ పనులను ప్రారంభించారు. గ్రామస్తులతో కలిసి పనులను పరిశీలించి. నీటి సరఫరాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామని తెలిపారు. వాన కాలంలో పరిశు ద్ధానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని గ్రామంలోని విధులు కాలనీలో పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. నీటి వనరులను పరిరక్షించడంతోపాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రధానం ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో గ్రామంలో ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులు చేపడుతామని తెలిపారు. తాగునీరు. పరిశుద్యం. డ్రైనేజీ. తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సాధించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వాతి. వార్డు సభ్యులు ఎల్లమ్మ. గౌరమ్మ. వెంకటమ్మ. సోమేశ్వర్ రెడ్డి. శ్రీకాంత్ రెడ్డి. మాజీ ఎంపీటీసీ కిరణ్ కుమార్. గ్రామస్తులు కొంకాల శ్రీను. మాల తిమ్మప్ప. ఎల్లప్ప. ఆశప్ప. తదితరులు పాల్గొన్నారు

## సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను

# పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించాలి: కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట ఆగస్టు 11:( స్కైన్యూస్)** దామరగిద్ద మండల కేంద్రం లోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించా రు.మండల మహిళా సమా ఖ్య కార్యాలయం పక్కన ఉన్న భవనంలో 2019 సంవత్సరం నుంచి సీజన్ వారీగా మహిళా సమాఖ్య సభ్యులు సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఎం జయన్న కలెక్టర్‌కు వివరిం చారు. యూనిట్ ద్వారా వచ్చిన లాభాలు, మహిళ లకు కల్పించిన ఉపాధి అవకాశాలతో పాటు యూనిట్‌లో తయారు చేసిన సీతాఫలం గుజ్జును విదేశాలకు సైతం ఎగుమతి చేసినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో కూడా సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగిం చాలని కలెక్టర్ సూచించా రు. ప్రస్తుతం ఉన్న భవనం లో సీతాఫలాలను నిల్వ చేసేందుకు, అవసరమైన ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసేందు కు స్థలం సరిపోవడం లేదని మహిళా సమాఖ్య సభ్య లు కలెక్టర్ దృష్టికి తీసుకువ చ్చారు. యూనిట్ నిర్వహ ణకు అనువుగా పెద్ద గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.దీనిపై తహసీ ల్దార్ తిరుపతయ్య మాట్లాడుతూ మండలంలో ని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించి నట్లు కలెక్టర్‌కు తెలిపారు. వీలైనంత త్వరగా ఆ స్థలా న్ని సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించా లని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అదేవిధంగా వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా అనువైన స్థలాన్ని కేటాయించాలని సూచిం చారు.స్థలం కేటాయించే వరకు ప్రస్తుత సీజన్‌లో ఉన్న భవనంలోనే సీతా ఫలం ప్రాసెసింగ్ యూని ట్‌ను కొనసాగించాలని మహిళా సమాఖ్య సభ్య లకు కలెక్టర్ సూచించారు.

**మహిళా సంఘాల కార్యకలాపాలపై ఆరా**

అనంతరం మండలంలోని స్వయం సహాయక సంఘా ల నిర్వహణ, బ్యాంకు రుణాలు, ఎన్‌పీఏ, కిశోర బాలికల సంఘాల ఏర్పా టు, వీఓ భవనాల నిర్మా ణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసు కున్నారు.మండలంలో నిర్మాణంలో ఉన్న వీఓ భవనాలను మరో 20 రోజుల్లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయా లని అధికారులను ఆదేశిం చారు. అవసరమైతే 'మై వన్' సాంకేతికతను విని యోగించి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచిం చారు.

**వీఓ భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్**

చివరగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న వీఓ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలిం చారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనుల ను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారు లకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెంకట్ రాములు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, ఎంపీడీవో సాయి లక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ ఉండాలి: జి భాస్కర్ రెడ్డి





**చిన్న చింతకుంట ఆగస్టు 11 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం, చిన్న వడ్డేమాన్ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై గ్రామ కార్యకర్తలతో ఎమ్మెల్యే సోదరులు జి.భాస్కర్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా సమస్యలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంపై చర్చించడం జరిగింది. అలాగే నూతన కమిటీ గురించి చర్చించడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు.ఈ సమావేశంలో సీసీకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.వెంకటేష్ యాదవ్, ఎమ్మెల్యే సోదరుడు జి భాస్కర్ రెడ్డి ,మాజీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి ,ఎ.మధుసూదన్ రెడ్డి , సురేందర్ రెడ్డి,మండల యూత్ అధ్యక్షుడు రంజిత్ రెడ్డి , ఎస్ సి, సెల్ అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని పార్టీ బలోపేతం, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధి – – ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు.కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల ఆశయాలను నెరవేర్చుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ వద్దు

**జీవో 641ను వెంటనే రద్దు చేయాలి**

**ప్రజారోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**







**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో ప్రజారోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ డంపింగ్ యార్డ్ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే చెత్త నుంచి వెలువడే దుర్వాసన, దుమ్ము, పొగతో పాటు హానికర వాయువుల కారణంగా పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. చెత్త వ్యర్థాలు భూమిలోకి, భూగర్భ జలాల్లోకి చేరితే నీటి కాలుష్యం ఏర్పడి తాగునీరు, వ్యవసాయ భూములు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు పెరగడం వల్ల ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ చేపట్టకపోతే భూసారం దెబ్బతినడంతో పాటు పంటలు, పర్యావరణ సమతుల్యతపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రామాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదని అంజయ్య యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు మించిన అభివృద్ధి మరొకటి లేదని స్పష్టం చేశారు. ధర్నాలో జేఏసీ సభ్యులు, పౌర హక్కుల సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, సిద్ధాపూర్ పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జీవో 641ను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. జీవో నంబర్ 641 రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అంజయ్య యాదవ్ హెచ్చరించారు.

## సి.పి.ఐ (ఎం) ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు



**దేవరకద్ర అమరచింత ఆగస్టు 11 (స్కై న్యూస్);**అమరచింత సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు రెండు రోజులు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి జి ఎస్, గోపి తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో భారతదేశ రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై పోరాటాలు, కార్మిక--కర్షక ఉద్యమాల ప్రాధాన్యత, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పిట్టల రవి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు రాజకీయంగా, సిద్ధాంతపరంగా మరింత చైతన్యవంతులై ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాడేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటేష్, ఆర్ ఎన్, రమేష్, ఎస్, అజయ్,టీ.రాఘవేంద్ర ఆత్మకూరు మండల కార్యదర్శి ఎస్, రాజు,పార్టీ సీనియర్ నాయకులు గోపాల్, బుచ్చన్న పార్టీ కౌన్సిలర్ మాధవిరాజేందర్, కోఆప్షన్ సభ్యులు షాజహాన్, శాఖ కార్యదర్శులు శ్రీను, చంటి, కర్ణ , పాండు, మోహన్, అంజి పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
బుధవారం 12 ఆగస్టు 2026

## ఏకరూప దుస్తుల తయారీ వేగవంతం చేయాలి...

**అర్హులైన వారందరికీ చేయూత పెన్షన్లు**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 11 (స్కై న్యూస్):**ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ఇచ్చేందుకు కుట్టిస్తున్న ఏకరూప దుస్తుల తయారీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్ నుంచి చేయూత పెన్షన్లు, సెన్సెస్, ఎస్ఐఆర్, ఏకరూప దుస్తుల తయారీ, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థులకు రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులను ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే ఒక జత బట్టలను పంపించడం జరిగిందని, ఇంకో జతను ఈనెల చివరి వరకు అందజేయాలన్నారు. ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆగస్టు 20వ తేదీలోగా యూనిఫామ్స్ అందించేలా తయారీ ప్రక్రియ వేగవంతం కావాలని ఆదేశించారు. జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ తయారీకి అన్ని గ్రామాలలో సదుపాయాలు, ఇతర సమగ్ర వివరాలను సంబంధిత జిపిఓలు పకడ్బందీగా సేకరించాలన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే పూర్తయినందున ఎన్యుమరేషన్ పత్రాలను ఫిలప్ చేసి ఇచ్చిన వారి వివరాలను డిజిటలైజేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఆగస్టు 17 లోపు ఎవరైనా ఎనిమరేషన్ పత్రాలను పూరించి తిరిగి ఇస్తే వారి వివరాలను డ్రాఫ్ట్ పబ్లికేషన్లో ప్రచురించడానికి అవకాశం ఉందన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం చేయూత పెన్షన్లను ఇస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తరణపై ఆర్అండ్‌బీ అధికారుల పరిశీలన

**త్వరలో రోడ్డు విస్తరణకు చర్యలు?**




**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణపై ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఆర్అండ్‌బీ డీఈ శ్రీలత, ఏఈ రాజశేఖర్ చౌరస్తా పరిసర ప్రాంతాలను పరిశీలించి రోడ్డు విస్తరణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. చౌరస్తా వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



చూపేలా రహదారి విస్తరణ చేపట్టే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. విస్తరణకు అవసరమైన స్థలం, రహదారి పరిస్థితులు తదితర అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. చౌరస్తాను పూర్తి స్థాయిలో విస్తరించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయడంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి తదుపరి కార్యాచరణ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అధికారుల తాజా పరిశీలనతో చౌరస్తా విస్తరణపై స్థానికుల్లో ఆశలు నెలకొన్నాయి.

## సీసీ రోడ్ల కల్వార్టు పనులు చేపట్టాలని ఎంపీడీవోకు వినతి

**వర్షాకాలంలో ఇబ్బందులు సమస్యల పరిష్కారా కోసం విజ్ఞప్తి**



**ఉట్కూర్ ఆగస్టు 11 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల పరిధిలోని
ఆవుసలోనిపల్లి గ్రామం ఒకటో వార్డు మెయిన్ రోడ్ నుంచి సిసి రోడ్లు పనులు చేపట్టాలని కోరుతూ పరువురు నాయకులు మంగళవారం ఎంపీడీవో పావని కి వినతి పత్రం సమర్పించారు. పీర్ల మసీదు వరకు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ వర్షాకాలంలో రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించడంతోపాటు గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి తిమ్మయ్య. వెంకట్ రెడ్డి. శ్రీనివాస్. వెంకటేశ్వర్ రెడ్డి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాపిడో పేరుతో కొత్త మోసం

**హైదరాబాద్, ఆగస్టు11:**హైదరాబాద్‌లోని చారిత్రక చార్మినార్ సమీపంలో ఓ యువతి పట్ల నకిలీ రాపిడో డ్రైవర్ అనుమానాస్పదంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. రాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న యువతిని లక్ష్యంగా చేసుకున్న ఆగంతకుడి బండారాన్ని ఆమె తన సమయస్ఫూర్తితో బయటపెట్టింది. ఈ ఘటన ప్రయాణికుల భద్రతపై మరోసారి చర్చను రేకెత్తించింది.కంటెంట్ క్రియేటర్ సిద్ధేశ్వరి సుగంత్ రాత్రి 9 గంటల సమయంలో చార్మినార్ వద్ద ఆటో కోసం వేచి చూస్తోంది. అదే సమయంలో స్కూటర్‌పై వచ్చిన ఓ వ్యక్తి, “ఎక్కడికి వెళ్లాలి? రాపిడో కావాలా మేడమ్?” అని అడిగాడు. అయితే, అతడి స్కూటర్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడం, అతడి వద్ద డ్రైవర్ ఐడీ కార్డు కూడా లేకపోవడాన్ని సిద్ధేశ్వరి గమనించింది.సందేహం రావడంతో ఐడీ కార్డు చూపించాలని ఆమె గట్టిగా నిలదీసింది. దీంతో కంగారుపడిన ఆ వ్యక్తి, ఆమె ముందే ప్లే స్టోర్ నుంచి రాపిడో యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం మొదలుపెట్టాడు. దీంతో అతడు నకిలీ డ్రైవర్ అని ఆమెకు స్పష్టంగా అర్థమైంది. వాహనం స్టార్ట్ కావడం లేదంటూ అతడు మాట దాటవేసే ప్రయత్నం చేశాడు. దీంతో అతడి ఫోన్‌ను పరిశీలించగా యాప్ అప్పుడే లాగిన్ అవుతూ ఓటీపీ పేజీలో ఉంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె “మర్యాదగా ఇక్కడి నుంచి వెళ్లిపో” అని గట్టిగా హెచ్చరించింది.ఎలాంటి బుకింగ్, వెరిఫికేషన్ లేకుండా ఇంత ధైర్యంగా ఒక వ్యక్తి బైక్ ఎక్కమనడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని సిద్ధేశ్వరి సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వీడియోను పంచుకోవడం ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేయడమే తన ఉద్దేశమని తెలిపింది.ఈ ఘటనపై స్పందించిన రాపిడో సంస్థ, సిద్ధేశ్వరి అప్రమత్తతను ప్రశంసించింది.

# రాజకీయ ఆర్భాటానికి విద్యార్థుల బలి..

**తిరంగా ర్యాలీలో ఎండకు అలమటించిన చిన్నారులు**
**నాయకుల నిర్లక్ష్యంతో మండుటెండలో మూడు కిలోమీటర్ల నడక**
**మధ్యాహ్నం వరకూ రోడ్లపైనే విద్యార్థులు**
**వైద్య సదుపాయాలు అందుబాటులో ఏర్పాటు చేశారా..?**
**చిన్న బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చి బాధ్యత ముగించుకున్న నిర్వాహకులు**
**పాఠశాల యాజమాన్యాల తీరుపై తల్లిదండ్రుల మండిపాటు**
**విద్యార్థి సంఘాల నేతల మౌనం దేనికోసం..?**
**మండుటెండలో విద్యార్థుల నడకపై ప్రశ్నలు ఎక్కడ..?**
**జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ జరపాలని డిమాండ్**






**కొత్తగూడెం, ఆగస్టు 11 (స్కై న్యూస్)**దేశభక్తిని చాటడం మంచిదే.. కానీ రాజకీయ నాయకుల ప్రచార ఆర్భాటం కోసం అభం శుభం తెలియని చిన్నారులను మండుటెండలో రోడ్లపైకి తీసుకురావడం ఎంతవరకు సమంజసం..? కొత్తగూడెం పట్టణంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరించిన తీరుపై తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నాయకుల ఆలస్యం, నిర్వాహకుల నిర్లక్ష్యంతో విద్యార్థులు నడిరోడ్డుపై ఎండకు అలమటించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రకాశం స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ సెంటర్, అండర్‌గ్రౌండ్, సింగరేణి సూపర్ బజార్, గణేష్ టెంపుల్, ఓల్డ్ డిపో సెంటర్, గోధుమవాగు బ్రిడ్జి మీదుగా లక్ష్మీదేవిపల్లి వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర సాగింది. ఉదయం వేళల్లోనే ముగించాల్సిన కార్యక్రమం నాయకుల రాక ఆలస్యం, నిర్వహణ లోపాలతో మధ్యాహ్నం వరకు కొనసాగింది. నెత్తిన మిట్టమధ్యాహ్నపు ఎండ కాస్తున్నా.. మధ్యాహ్నం 12 గంటలు దాటినా విద్యార్థులను రోడ్లపై నడిపించడంతో పలువురు చిన్నారులు ఆయాసం, నీరసం తో అల్లాడిపోయారు. ఇంత జరిగినా విద్యార్థుల ఆరోగ్యంపై కనీస శ్రద్ధ చూపని నిర్వాహకులు.. చివరకు ఒక్కో విద్యార్థి చేతిలో బిస్కెట్ ప్యాకెట్ పెట్టి పంపించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారులకు తగినంత మంచినీరు, విశ్రాంతి, వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను కూడా విస్మరించారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. దేశభక్తి కార్యక్రమాల పేరుతో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. నాయకుల మెప్పు కోసం చిన్నారుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం ఏమిటని నిలదీస్తున్నారు. నాయకులు సమయానికి రాకపోతే కార్యక్రమం వాయిదా వేయడం లేదా విద్యార్థులను సురక్షితంగా పాఠశాలలకు తరలించాల్సిన బాధ్యత నిర్వాహకులు, పాఠశాల యాజమాన్యాలపై ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. మరోవైపు మండుటెండలో విద్యార్థులను మూడు కిలోమీటర్ల మేర నడిపించడంపై విద్యార్థి సంఘాల నేతలు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు గొంతెత్తే విద్యార్థి సంఘాల నేతల మౌనం దేనికోసం అన్న చర్చ జరుగుతోంది. చిన్నారులు ఎండలో అల్లాడుతున్నా.. వారి తరఫున ప్రశ్నించేవారు.. నిలదీసేవారు...ఎక్కడ అంటూ పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ కార్యక్రమం కావడంతోనే విద్యార్థి సంఘాల నేతలు మౌనం వహించారా..? అన్న ప్రశ్నలు తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నుంచి వినిపిస్తున్నాయి. దేశభక్తి, జాతీయ జెండా గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించాలనుకుంటే పాఠశాలల ఆవరణలోనే కార్యక్రమాలు నిర్వహించవచ్చని మేధావులు సూచిస్తున్నారు. రాజకీయ ప్రచార కార్యక్రమాలకు చిన్నారులను గంటల తరబడి ఎండలో నడిపించడం మాత్రం బాధ్యతారాహిత్యమని విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దేశభక్తి పేరుతో చిన్నారుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే పరిస్థితులకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

**లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో పనిచేయాలి**
**ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలి**
**జలశ్రీ, వనమహోత్సవం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**
**అదనపు కలెక్టర్ కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోని వాస్తవ అవసరాలను గుర్తించి, వివిధ శాఖల పథకాలు, నిధులు, మానవ వనరులను అనుసంధానం చేసి ప్రజలకు గరిష్ట ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జలశ్రీ, జిపిఎస్ ఏపీ , 2026--27 జీపీడీపీ , బీపీడీపీ , డీపీడీపీ , వనమహోత్సవం, పారిశుధ్యం, శాఖల కన్వర్జెన్స్ తదితర అంశాలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. ప్రతి గ్రామానికి సమగ్ర ప్రణాళిక ప్రతి గ్రామానికి స్పష్టమైన అభివృద్ధి దిశ ఉండాలని, గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నమోదు చేయాలని కిరణ్మయి సూచించారు. ఒకే గ్రామంలో వివిధ శాఖలు వేర్వేరుగా పనులు చేపట్టకుండా పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. జి పి ఎస్ ఏ పి లో గ్రామ జనాభా, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం, నీటి వనరులు, పర్యావరణం తదితర అంశాల పూర్తి వివరాలను పొందుపరచాలని తెలిపారు. ప్రతి గ్రామానికి ఒక సమగ్ర సమాచార పత్రం అందుబాటులో ఉండాలని అన్నారు. 2026--27 జీపీడీపీ లో అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలు, పథకాలు, నిధులను అనుసంధానం చేయాలని ఆదేశించారు. గ్రామ సభలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రజల అవసరాల ఆధారంగా ప్రాధాన్యతా పనులను గుర్తించి జీపీడీపీ లో చేర్చాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు పరస్పరం అనుసంధానమయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జలశ్రీ కింద నీటి సంరక్షణ వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం కోసం జలశ్రీ కింద ఫార్మ్ పాండ్స్, సోక్ పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు తదితర నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. వర్షపు నీటిలో ఒక్క చుక్క కూడా వృథా కాకుండా శాశ్వత నీటి సంరక్షణ నిర్మాణాలను ప్రోత్సహించాలని అన్నారు. మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా స్పష్టమైన బాధ్యతలు కేటాయించాలని ఆదేశించారు. మొక్కలకు నీటి సదుపాయం, రక్షణ, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కిరణ్మయి ఆదేశించారు. మురుగు కాలువలు, నీటి నిల్వలు, చెత్త పేరుకుపోయే ప్రాంతాలు, ప్రజా ప్రదేశాలను శుభ్రం చేయాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టడంతో పాటు తాగునీటి వనరుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని వైద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించారు. “కన్వర్జెన్స్ ద్వారా గరిష్ట ఫలితాలు ప్రజలకు గరిష్ట ప్రయోజనం” అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. సమావేశంలో జెడ్ పి సి ఈ ఓ /డి ఆర్ డి ఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, వివిధ శాఖల ఈ ఈ లు, బి డబ్ల్యు ఓ, డి ఎం అండ్ హెచ్ ఓ స్వర్ణకుమారి, ఎంపీడీఓ లు, ఎంపీ ఓ లు, ఏ పి ఓ లు, ఏపీఎం లు, డిప్యూటీ.ఈఈ లు, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

**షాద్‌నగర్ 18వ వార్డు పార్కులో షీ టీమ్స్ అవగాహన కార్యక్రమం**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (స్కై న్యూస్):** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ షీ టీమ్స్ సూచించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 18వ వార్డులోని పార్కులో స్థానిక షీ టీమ్స్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందూలాల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన కార్మికులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ షీ టీమ్ ఇన్‌చార్జి సురేష్ గౌడ్, అధికారులు జ్యోతి, శ్రీకాంత్, శేఖర్ మాట్లాడుతూ గుర్తుతెలియని ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. నకిలీ ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడి ఆఫర్లు, డిజిటల్ అరెస్టులు, సోషల్ మీడియా మోసాల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు, మహిళలు, యువత, వృద్ధులకు సైతం సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా సైబర్ నేరాలను గణనీయంగా అరికట్టవచ్చని షీ టీమ్ అధికారులు తెలిపారు.

# ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో వైభవంగా బోనాల సంబరాలు

**కొత్తగూడెం ఆగస్టు 11 ( స్కై న్యూస్):**రామవరం ఎస్సీబీ నగర్‌లోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో బోనాల సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు పండుగల ప్రాధాన్యతను చిన్నారులకు వివరించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. తలపై బోనాలు మోస్తూ చిన్నారులు నిర్వహించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జోనల్ ఇన్ ఛార్జ్ సతీష్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు దేశంలోనే ప్రత్యేకమైనవని అన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్నారులకు పండుగల విశిష్టతను



ప్రత్యక్ష కార్యక్రమాల ద్వారా తెలియజేయడం వల్ల వారిలో మన సంప్రదాయాల పట్ల గౌరవం, బాధ్యత పెంపొందుతుందని తెలిపారు. జోనల్ అకౌంట్స్ ఆఫీసర్ స్నేహలత, అకడమిక్ డీన్ పవన్ కుమార్, ప్రిన్సిపల్ నరేష్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, క్రమశిక్షణతో బోనాల వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమని వారు



పేర్కొన్నారు. పాఠశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ దుస్తులు, బోనాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.

# హాస్టల్ పరిసరాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి...

**: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**





**మహబూబ్‌నగర్, ఆగస్టు 10(స్కైన్యూస్ )** జిల్లాలోని వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా, పాములు, విషపురుగులకు ఆవాసంగా మారకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వసతి గృహాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై అన్ని సంక్షేమ శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలు, గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, ఇతర ప్రదేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వసతి గృహాల పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పొదలు, నిల్వ నీరు లేకుండా చూడాలని తెలిపారు. పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించి, వ్యర్థాలను సక్రమంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పాములు, ఇతర విషపురుగులు దాగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాముకాట్ల నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వసతి గృహాల భవనాల చుట్టూ పరిశుభ్రతను పాటించడంతో పాటు రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి, తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి....

**సార్వత్రిక విద్యతో ఉన్నత చదువులకు అవకాశం.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 11 (స్కై న్యూస్):**చదువును మధ్యలో ఆపేసిన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విధానం ద్వారా తిరిగి చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్ సి, ఇంటర్ లో ప్రవేశాల గోడపత్రికలను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఎస్ఎస్ సి లో చేరేందుకు ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండిన వారు అర్హులని, ఎలాంటి



విద్యార్హతలు అవసరం లేదన్నారు. ఇంటర్ కు సంబంధించి ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నుండి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన బోర్డు నుండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని లేదా ఇతర బోర్డులలో ఇంటర్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని తెలిపారు. రెండింటికి గరిష్ట వయో పరిమితి లేదన్నారు. టాస్ ద్వారా ఉత్తీర్ణులైన విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాల ద్వారా ఉన్నత చదువులకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గల వారందరూ మరిన్ని వివరాలకు తమ సమీపంలోని దూర విద్య కేంద్రం సమన్వయకర్తను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సంబంధిత వెబ్సైట్ ద్వారా ఈనెల 17వ తేదీలోగా, జరిమానాతో ఈనెల 29వ తేదీ వరకు ఆన్లైన్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, టాస్ జిల్లా కోఆర్డినేటర్ సునీతమ్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ స్కూల్ కోసం స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**మహబూబ్‌నగర్, ఆగస్టు 10(స్కైన్యూస్ )**హన్వాడ మండల కేంద్రంలోని 2బీహెచ్‌కే ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హన్వాడ తహసీల్దార్, మండల సర్వేయర్‌తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందా, భూమి విస్తీర్ణం, సరిహద్దులు తదితర అంశాలపై వివరాలను సేకరించారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థలంగా ఉందా అనే అంశంపై అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు

# వ్యవసాయ క్షేత్రంలో కృష్ణవేణీ పాఠశాల విద్యార్థులు

**రైతు శ్రమ, వ్యవసాయ విధానాలపై ప్రత్యక్ష అవగాహన**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 11 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణం లోని స్థానిక కృష్ణవేణీ పాఠశాలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు వ్యవసాయ క్షేత్ర పర్యటనలో పాల్గొని రైతుల శ్రమ, పంట సాగు విధానాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో శ్రీరంగపూర్ గ్రామ రైతు, సర్పంచ్ రమేశ్, డిప్యూటీ సర్పంచ్ సయ్యద్ ముస్తఫా ఆధ్వర్యంలోని వ్యవసాయ క్షేత్రాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పంట నాట్ల నుంచి దిగుబడి వరకు జరిగే వివిధ దశలను విద్యార్థులు పరిశీలించారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు, వ్యవసాయంలో వారి శ్రమ గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ నేల స్వభావం, వ్యవసాయ పనిముట్లు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వినియోగం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ వ్యవసాయం



భారతదేశానికి ప్రధాన జీవనాధారమని అన్నారు. తరగతి గదిలో బోధించే అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూపించడం వల్ల విద్యార్థులకు విషయాలపై మరింత స్పష్టమైన అవగాహన కలుగుతుందని తెలిపారు. డిప్యూటీ సర్పంచ్ సయ్యద్ ముస్తఫా మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ



కూలీల శ్రమను విద్యార్థులు అర్థం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. రైతులు ఎదుర్కొనే కష్టనష్టాలు, వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

**ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష**

**హైదరాబాద్:**తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# కేరళలో మెస్సీ మ్యాచ్‌పై ఆర్థిక అవకతవకలు

**తిరువనంతపురం, ఆగస్టు11:**ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ, ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనా జట్టును కేరళకు తీసుకువచ్చే ప్రయత్నం విఫలం కావడంపై తీవ్ర వివాదం రాజుకుంది. గత వామపక్ష ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై నియమించిన విచారణ కమిటీ తన నివేదికను ప్రస్తుత వి.డి. సతీశన్ ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు జరిగినట్టు తేలడంతో ప్రభుత్వం తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. రేపు జరగనున్న కేబినెట్ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. క్రీడల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎన్. ప్రశాంత్ నేతృత్వంలో జరిగిన ఈ విచారణలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అర్జెంటీనా మ్యాచ్ కోసం స్పాన్సర్‌ను ఎంపిక చేసిన విధానం, ఆర్థిక లావాదేవీలు, కొచ్చిలోని జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ స్టేడియం అప్పగింత వంటి అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించినట్టు నివేదిక స్పష్టం చేసింది. ఒక నిర్దిష్ట కంపెనీకి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని కూడా నివేదికలో పేర్కొన్నారు. అసలు అర్జెంటీనా జట్టు కేరళకు వస్తుందనడానికి ఎలాంటి అధికారిక పత్రాలు, ఒప్పందాలు లేవని విచారణలో తేలడం గమనార్హం. ఫిఫా రిజిస్ట్రేషన్, ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) అనుమతి వంటి తప్పనిసరి క్లియరెన్సులు లేకుండానే ఈ ప్రక్రియను వేగంగా ముందుకు నడిపారని నివేదిక గుర్తించింది. ఈ వ్యవహారంలో గత క్రీడల శాఖ మంత్రి వి. అబ్దురహిమాన్ పాత్రపై కమిటీ తీవ్ర ఆరోపణలు చేసింది. కీలక నిర్ణయాలన్నీ ఆయనే తీసుకున్నారని, నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపింది. ఈవెంట్‌కు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ మంత్రి కార్యాలయం నేరుగా నిర్వహించిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో మంత్రిగా ఆయన చేసిన అధికారిక ప్రయాణాలు, ఈ-మెయిల్ కమ్యూనికేషన్లపై సమగ్ర విచారణ జరపాలని కమిటీ సిఫార్సు చేసింది. ఇక, కొచ్చిలోని స్టేడియం అప్పగింతలోనూ భారీ లోపాలున్నట్టు నివేదిక పేర్కొంది. మ్యాచ్ ఎప్పుడు జరుగుతుందో స్పష్టత లేకుండానే స్టేడియంను ప్రైవేట్ కంపెనీకి అప్పగించారని, కనీస ఆర్థిక భద్రత చర్యలైన ఇన్సూరెన్స్ కవర్, బ్యాంక్ గ్యారెంటీ వంటివి కూడా తీసుకోలేదని వెల్లడించింది. మెస్సీ, అర్జెంటీనా జట్టు వస్తోందన్న వార్తలతో కేరళలో భారీ అంచనాలు నెలకొనగా, చివరకు ఆ ఈవెంట్ రద్దు కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విచారణ నివేదికతో ఈ వ్యవహారం మరోసారి రాజకీయంగా వేడెక్కింది.

# ఆర్థిక వృద్ధిపై చంద్రబాబు సమీక్ష

**రెండో త్రైమాసికంలో 10.7శాతం వృద్ధిరేటు నమోదు**

**విజయవాడ, ఆగస్టు11:**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటూ సానుకూల వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన రెండేళ్లుగా జాతీయ సగటును మించి ప్రగతి సాధిస్తున్న ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణంలోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దానిని అధిగమించి రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు పథంలో నడిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు సమర్పించిన జూలై నెల ఆర్థిక నివేదికపై ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రణాళికా విభాగం నివేదిక ప్రకారం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం ఉండగా, 2025-26 నాటికి 9.9 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం చొప్పున వృద్ధి సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచాయి. పశుసంవర్ధక శాఖలో మాంసం, గుడ్ల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఐటీ, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు



ఊపందుకున్నాయి. టెక్నాలజీ వినియోగంతో జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282 కోట్లకు చేరగా, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టులు, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ పెట్టుబడులు గ్రౌండింగ్‌లో మంచి వృద్ధిని కనబరిచాయి. ఈ ఆర్థిక ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఎల్ నినో ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉంది. కృష్ణా నదిలో ప్రవాహాలు లేక శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండలేదు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించి ఆదుకున్నాం. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జీఎస్‌డీపీ పడిపోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని ఆయన సూచించారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూసేందుకు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. "సామాన్యుడిపై భారం పడకూడదు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలపై తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ మాదిరిగా అన్ని శాఖల్లో టెక్నాలజీని వాడి లక్ష్యాలు సాధించాలి" అని స్పష్టం చేశారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు సిద్ధం చేస్తే లక్ష్య సాధన సులభమవుతుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై ప్రభావం పడకుండా చూడాలని, మొత్తంగా రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు దిశగా నడిపించేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఈడీ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

## బిజినెస్

### గల్ఫ్ పరిణామాలు కీలకం.. మార్కెట్ పల్స్




దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గినట్టే తగ్గి పెరుగుతున్నా యి. ఈ క్రమంలోనే పడుతూ.. లేస్తూ.. అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 404.53 పాయింట్లు లేదా 0.51 శాతం పెరిగి 78,499.17 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 187.05 పాయింట్లు లేదా 0.76 శాతం అందుకొని 24,570.65 దగ్గర స్థిరపడింది. ఈ నేపథ్యంలో హెుర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రవాణా, అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు ఈ వారం కీలకమని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. అలాగే ఏప్రిల్-జూన్ ఆర్థిక ఫలితాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు, ఎల్ నినో సంబంధిత సమాచారం సైతం ప్రధానమే. కాగా, బ్యాంకింగ్, ఆటో, ఆయిల్ షేర్లలో సెల్లింగ్ ప్రెషర్‌కు అవకాశాలున్నాయని చెప్పవచ్చు. ఇక అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,700-24,900 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చనీ చెప్తున్నారు.

**గమనిక..**


స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న వివరాలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

### మారుతున్న జాబ్ మార్కెట్.. వాళ్లకే ఉద్యోగాలు!

ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్‌లో ఊహకందని మార్పులు జరుగుతున్నాయి. కొత్త టెక్నాలజీలు వస్తున్నాయి. ఏఐ.. ఆటోమేషన్ వల్ల చాలా పనులు సులభంగా మారుతున్నాయి. కాబట్టి.. భవిష్యత్తులో ఉద్యోగం పొందడానికి కేవలం అనుభవం మాత్రమే సరిపోదు. కొత్త విషయాలను త్వరగా నేర్చుకునే సామర్థ్యం కూడా చాలా ముఖ్యం. ఎక్కువ అనుభవం ఉన్న వ్యక్తి కంటే.. కొత్త విషయాలను త్వరగా నేర్చుకునే వ్యక్తులకే ఎక్కువ ఉద్యోగావకాశాలు లభిస్తాయని విద్యావేత్త, రచయిత ప్రశాంత్ కిరాడ్ పేర్కొన్నారు. దీనికి కారణం.. స్కిల్స్ ఎప్పటికప్పుడు మారుతుండటమే అని వెల్లడించారు. కాబట్టి ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం చాలా అవసరం అని ఆయన అన్నారు. ఉద్యోగ ప్రపంచంలో మనగలగాలంటే.. ఏ స్కిల్స్ నేర్చుకోవాలి? అని మాత్రమే కాకుండా.. అవసరం వచ్చినప్పుడు కొత్త స్కిల్ ఎంత వేగంగా నేర్చుకోగలను అనే విషయాన్ని కూడా తప్పకుండా ఆలోచించాలి. అయితే ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. కొత్త స్కిల్ నేర్చుకున్న వెంటనే రిజల్ట్స్ రావాలని ఆశించకూడదు. కనీసం 90 రోజుల పాటు ప్రతిరోజూ ఫోకస్ పెట్టి ప్రాక్టీస్ చేసి, ఆ తర్వాత అది మనకు ఉపయోగపడుతుందా లేదా అని నిర్ణయించుకోవాలి. ప్రపంచం మారుతున్నప్పుడు.. మనం కూడా మారాలి.

## మదుపరి చనిపోతే మ్యూచువల్ ఫండ్స్ క్లెయిమ్ ఎలా..

# సెబీ కొత్త నిబంధనల్లో ఏముంది?



కుటుంబంలో ఒకరు చనిపోతే ఆ బాధ అంతాఇంతా కాదు. అలాంటి సమయంలో కుటుంబ శ్రేయస్సు కోసం వారు పెట్టిన పెట్టుబడుల కోసం మిగతా సభ్యులు నానా ఇబ్బందులు పడాల్సివస్తే మరింత కుంగుబాటు తప్పదు ఎవ్వరికైనా. అయినప్పటికీ చాలా కుటుంబాలు ఇప్పుడు ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. మదుపరి మరణానంతరం వారి కుటుంబ సభ్యులు.. రకరకాల పత్రాలను సమర్పించాల్సి వస్తున్నది మరి. ఈ క్రమంలో పేర్లలో తప్పులు, చిరునామాలో అభ్యంతరాలు, సంతకాలు సరిపోవడం లేదని.. ఇలా ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ)కు పలు సూచనలు చేసింది. మ్యూచువల్ ఫండ్ సంస్థల బదిలీ ప్రక్రియకు సాయం చేయాలని, అవసరమైన న్యాయ సంబంధిత పరిశీలనలు చేస్తూనే అసలైన క్లెయిమ్‌ల పరిష్కారానికి కృషి చేయాలంటూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను సవరించింది. అసలు ఇందులో ఏం మారింది? మ్యూచువల్ ఫండ్ యూనిట్లను ఎవరు క్లెయిమ్ చేసుకోవచ్చు? ఏమేం డాక్యుమెంట్స్ అవసరం అవుతాయి? ప్రతీ మదుపరి తెలుసుకోవాల్సింది ఏమిటో ఒక్కసారి చూద్దాం.

**గుర్తుంచుకోండి**

మ్యుచువల్ ఫండ్ యూనిట్లను ఇద్దరు మదుపర్లు కలిసి నిర్వహిస్తున్నట్లైతే.. చనిపోయిన మదుపరి పేరును తొలగించాలని జీవించి ఉన్న మదుపరి కోరవచ్చు. లేదా సదరు యూనిట్ల బదిలీకి విజ్ఞప్తి చేయవచ్చు. నిబంధనలకు లోబడి ప్రక్రియ మొదలవుతుంది.

ఒకవేళ చనిపోయిన మదుపరే మొత్తం మ్యూచువల్ ఫండ్ యూనిట్లకు యజమానైతే.. రికార్డుల్లో నామినీ పేరుంటే ఆ హక్కులను నామినీ పొందవచ్చు. నామినీ లేకపోతే లీగల్ వారసులకు చెందుతుంది. ఇందుకు మరింత డాక్యుమెంటేషన్ అవసరం ఉంటుంది.

నామినీ ఉన్నట్లైతే డెత్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, కేవైసీ డాక్యుమెంట్లు, బ్యాంక్ అకౌంట్ ప్రూఫ్‌లు మ్యూచువల్ ఫండ్ యూనిట్ల బదిలీ విజ్ఞప్తికి అవసరమవుతాయి. నామినీ లేకపోతే వారసత్వ ధ్రువీకరణ, కోర్ట్ ఆర్డర్, వారసుల నుంచి ఎన్‌వోసీ తదితర సంబంధిత లీగల్ డాక్యుమెంట్లు అవసరం.

కొన్ని కేసుల్లో నామినీ ఉన్నా వారసుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతుంటాయి. అప్పుడు మదుపరి వీలునామా కీలకం అవుతుంది. లేకపోతే న్యాయపరమైన చిక్కులు తప్పవు.

కేవైసీ వివరాలు గడువు మీరినా, బ్యాంక్, పాన్, మ్యూచువల్ ఫండ్ ఫోలియోల్లో పెద్ద తేడాలున్నా, వారసుల మధ్య వివాదాలున్నా క్లెయిమ్ పరిష్కారానికి సమయం పట్టవచ్చు. ఇలాంటి కేసుల్లో సెబీ కొత్త నిబంధనలూ పనిచేయవని మరువద్దు. అన్నీ సరిగ్గా ఉండి, ఆలస్యమవుతున్నప్పుడే సెబీ నూతన నిబంధనల ప్రకారం ప్రక్రియ వేగవంతం కాగలదు.

**సెబీ ఏం మార్చింది?**

డాక్యుమెంటేషన్‌లోగల చిన్నచిన్న వ్యత్యాసాలతో క్లెయిమ్ విజ్ఞప్తిని ఆపరాదు. మునుపు మ్యూచువల్ ఫండ్ ఫోలియో.. క్లెయిమ్ చేసినవారి తాజా కేవైసీ రికార్డుతో సరిపోకపోతే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు క్లెయిమ్ పరిష్కారానికి తరచూ అఫిడవిట్లు, ఇతర డిక్లరేషన్లు కోరేవి. కొత్త రూల్స్‌తో అనవసరపు పేపర్ వర్క్ తగ్గిపోగలదు. మదుపరి పేర్లు, సంతకాల్లో వ్యత్యాసాల విషయంలోనూ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సెబీ కొత్త సూచనలు చేసింది. ఆధార్, పాస్‌పోర్టుల ఆధారంగా గుర్తించుకోవచ్చన్నది. అలాగే స్టాండర్డ్ వెరిఫికేషన్ ప్రొసీజర్లను రిజిస్ట్రార్స్, ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ల ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు యాంఫీ శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

### ప్రీస్కూల్ ఫీజు రూ.9 లక్షలు!.. ఎక్కడంటే?

ఈ రోజుల్లో స్కూల్ ఫీజులు ఎక్కువగా ఉంటాయని చాలామందికి తెలుసు. కానీ ప్రీస్కూల్ ఫీజు రూ.9 లక్షలు ఉంటుందంటే.. వినడానికి చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. కానీ ఇది నిజం. దీనికి సంబంధించిన ఒక వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరిన్ని వివరాలు ఈ కథనంలో చూసేద్దాం. అమెరికాలో పిల్లల ప్రీస్కూల్ చదువుకు ఎంత ఖర్చవుతుందో.. తెలిపిన ఓ భారతీయ మహిళ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అమెరికాలోని కనెక్టికట్‌లో నివసిస్తున్న భారతీయ కంటెంట్ క్రియేటర్ సోనల్ చౌదరి.. తన రెండేళ్ల కుమార్తె బానీ కోసం ఓ ప్రైవేట్ ప్రీస్కూల్‌ను సందర్శించారు.

అక్కడ పిల్లలకు ఎలాంటి విద్య అందిస్తారు?, ఫీజు ఎంత ఉంటుంది? అనే విషయాలను ఆమె తెలుసుకున్నారు. ఈ ప్రీస్కూల్‌లో కేవలం ఎనిమిది మంది పిల్లలకు ఇద్దరు టీచర్లు ఉంటారని సిబ్బంది తెలిపారు. పిల్లలకు పాటలు, యోగా, క్రియేటివ్ యాక్టివిటీస్, ఆటలతో పాటు వయసుకు తగ్గట్టుగా నేర్చుకునే కార్యక్రమాలు నిర్వహిస్తారని వెల్లడించారు.

అయితే.. ఫీజు గురించి తెలుసుకున్నప్పుడు సోనల్‌కు అసలు షాక్ తగిలింది. వారానికి రెండు రోజులు ప్రీస్కూల్‌కు పంపిస్తే ఏడాదికి సుమారు రూ.4 లక్షలు ఖర్చవుతుందట. అదే వారానికి ఐదు రోజులు పంపిస్తే ఏడాదికి దాదాపు రూ.9 లక్షలు చెల్లించాలి. అంటే ప్రీస్కూల్ ఫీజుతో.. మన దేశంలో కొత్త మారుతి బ్రెజ్జా కారు కొనుగోలు చేయొచ్చన్నమాట. ఇక్కడ తరగతులు సెప్టెంబర్ నుంచి జూన్ చివరి వరకు కొనసాగుతాయి. ఉదయం 8.45 గంటలకు ప్రారంభమై 11.45 గంటలకు ముగుస్తాయి. అంటే రోజుకు మూడు గంటల క్లాసులకే ఇంత భారీ మొత్తంలో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఫీజు ఎక్కువగా ఉన్నప్పటికీ.. పిల్లలపై చూపించే వ్యక్తిగత శ్రద్ధ, తక్కువ మంది పిల్లలతో తరగతులు నిర్వహించడం, ప్రత్యేకమైన యాక్టివిటీస్ వంటి సౌకర్యాలను చూసిన తర్వాత ఆ ఫీజు ఎందుకు ఎక్కువగా ఉందో అర్థమైందని సోనల్ చెప్పారు. అమెరికాలో కిండర్‌గార్టెన్ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్య సాధారణంగా ఉచితంగా ఉంటుందని సోనల్ పేర్కొన్నారు. దీంతో ప్రైవేట్ ప్రీస్కూల్ విద్య అమెరికా తల్లిదండ్రులకు పెద్ద ఖర్చుగా మారుతోందని తెలిపారు.

## రాణించిన జైస్వాల్.. సిరాజ్ మెరుపులు..

# టీమిండియా గెలుపు

శ్రీలంక క్రికెట్ ఎలెవెన్‌తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 207 పరుగుల లక్ష్యాన్ని భారత్ 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన యశస్వి జైస్వాల్ (61 రిటైర్ట్ హర్ట్) మెరుపు అర్ధ సెంచరీ చేసి భారత గెలుపుకు గట్టి పునాది వేశాడు. గాయం కారణంగా తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక ఇన్నింగ్స్ (44) ఆడాడు. ఆఖర్లో సిరాజ్ సిక్సర్లతో (32 నాటౌట్; ఫోర్, 4 సిక్సర్లు) విరుచుకుపడి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు.

**టార్గెట్ 207**

లంక ఎలెవెన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి, టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషాన్ మధుష్క (63 రిటైర్డ్ హర్ట్) అర్ధ సెంచరీతో రాణించగా.. అంజల బండార (35), నిపున్ ధనంజయ (46) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు తీయగా.. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ ద?క్కించుకున్నారు.

**పడిక్కల్ అజేయ శతకం**

భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 357 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (142 నాటౌట్) అజేయ సెంచరీతో సత్తా చాటాడు. రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్) అర్ధ సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్ (40), మానవ్ సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్), సరాన్ష్ జైన్ (22 రిటైర్డ్ హర్ట్) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో







అసంక మనోజ్, రమేశ్ మెండిస్ తలో 2 వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువంత చెరో వికెట్ దక్కించుకున్నారు. దీనికి ముందు శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నిషాన్ మధుష్క (66), రవిందు రషాంత (71), సోనల్ దినుష (52) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలో 2 వికెట్లు తీయగా.. బ్రార్ చెరో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్ తర్వాత భారత జట్టు శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లోని తొలి టెస్ట్ మ్యాచ్ గాలే వేదికగా ఆగస్ట్ 15 నుంచి మొదలుకానుంది. రెండో టెస్ట్ కొలంబో వేదికగా ఆగస్ట్ 23న ప్రారంభం కానుంది.

### బంగ్లాదేశ్ పర్యటనపై అనిశ్చితి.. కేంద్రం అనుమతి కోరనున్న బీసీసీఐ..!



భారత్‌లో టీ20 ప్రపంచకప్‌ను బాయ్‌కాట్ చేసిన బంగ్లాదేశ్(ధీుఅస్త్రశ్రీుఎవంప్త)తో వన్డే సిరీస్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. కొత్తగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ఆగస్టులోనే టీమిండియా బంగ్లా పర్యటనకు వెళ్లాలి. కానీ, ఇప్పటివరకూ బీసీసీఐ(దీజజ×) నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇరుదేశాల బోర్డుల మధ్య సఖ్యత లేకపోవడం, భద్రతపరమైన ఆందోళనల నేపథ్యంలో కేంద్రం అనుమతి కోరనుంది బీసీసీఐ. బంగ్లాదేశ్ పర్యటన విషయంలో భారత బోర్డు సొంతంగా నిర్ణయం తీసుకోలేదని ఇండియా టుడేతో బీసీసీఐ ప్రతినిధులు చెప్పారు. బంగ్లాలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ద్వైపాక్షిక సిరీస్ నిర్వహణకు సిద్ధంగా ఉన్నందున కేంద్రం అనుమతి తీసుకోవాలని బీసీసీఐ భావిస్తోంది 'బంగ్లాదేశ్ పర్యటన విషయంలో మేము కేంద్రం అనుమతి తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చాకే నిర్ణయం ప్రకటిస్తాం. ప్రస్తుత పరిస్థితుల్లో మాకు మేముగా ఏ నిర్ణయం తీసుకోలేం. ఇప్పటివరకూ బంగ్లాదేశ్‌కు టీమిండియాను పంపాలా? వద్దా? అనేదానిపై ఏమీ ఆలోచించలేదు. అయితే.. త్వరలోనే ప్రభుత్వాన్ని సంప్రదిస్తాం. సిరీస్ విషయమై బంగ్లా బోర్డు మాకు లేఖ రాసింది. ఇప్పటికైతే ఇరుదేశాల బోర్డులు నిత్యం టచ్‌లోనే ఉన్నాయి' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

## స్పోర్ట్స్

### టీమిండియాతో మరిన్ని సిరీస్‌లు.. ఈసీబీ కీలక ప్రకటన

ట్రై-సిరీస్‌లకు మళ్లీ తెరతీసే యోచన

భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు ప్రాధాన్యం

భారత క్రికెట్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (జుజదీ) భావిస్తోంది. టీమిండియాతో మరిన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఈసీబీ ఆసక్తి చూపుతోంది. ముఖ్యంగా వన్డేల్లో మూడు దేశాల ట్రై-సిరీస్‌లను తిరిగి తీసుకురావాలని యోచిస్తోంది. అలాగే భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఈసీబీ సీఈఓ రిచర్డ్ గౌల్డ్ వెల్లడించారు.

**12-18 నెలల్లో ట్రై-సిరీస్‌లు..?**

వన్డే క్రికెట్‌లో మూడు దేశాల ట్రై-సిరీస్‌లను తిరిగి ప్రవేశపెట్టే దిశగా చర్చలు జరుగుతున్నాయని రిచర్డ్ గౌల్డ్ తెలిపారు. వచ్చే 12 నుంచి 18 నెలల్లో కొన్ని ట్రై-సిరీస్‌లు నిర్వహించే అంశంపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందుతున్నాయని ఆయన వెల్లడించారు. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌లో ట్రై-సిరీస్‌లను తిరిగి తీసుకురావాలని గతంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఈసీబీ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ట్రై-సిరీస్‌లు సాధారణంగా ఉండేవి. అయితే గత కొన్నేళ్లుగా ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ టోర్నీలకే ఎక్కువ ప్రాధాన్యం లభించడంతో మూడు దేశాల సిరీస్‌లు దాదాపుగా కనుమరుగయ్యాయి.

భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య చివరి ప్రధాన పురుషుల వన్డే ట్రై-సిరీస్ 2015లో జరిగింది. ఆ టోర్నీలో ఇంగ్లండ్ విజేతగా నిలిచింది.

**భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు ప్రాధాన్యం**

వన్డేలతో పాటు టెస్టు క్రికెట్‌పైనా ఈసీబీ ప్రత్యేక దృష్టి పెట్టింది. భారత్, ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లను ఇంగ్లండ్ క్రికెట్‌లో అత్యున్నత స్థాయి పోటీగా రిచర్డ్ గౌల్డ్ అభివర్ణించారు. భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లు ఆడేందుకు ఈసీబీ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో దక్షిణాఫ్రికాతో కూడా ఇలాంటి సుదీర్ఘ టెస్టు సిరీస్‌లు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఐదు టెస్టుల సిరీస్ వల్ల ఇరు జట్లకు పుంజుకునే అవకాశం లభించడంతో పాటు, ఆటగాళ్ల సామర్థ్యానికి అసలైన పరీక్ష ఎదురవుతుంది. ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల ప్రభావం పెరుగుతున్న సమయంలో టెస్టు క్రికెట్‌కు ఇలాంటి సుదీర్ఘ సిరీస్‌లు మరింత ప్రాధాన్యం కలిగిస్తాయని ఈసీబీ భావిస్తోంది.

**మళ్లీ వన్డేల వైపు ఎందుకు..?**

ప్రస్తుతం టెస్టు, టీ20 క్రికెట్ మధ్య వన్డే ఫార్మాట్ తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పోరాడుతోంది. ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లకు పెద్ద టోర్నీలతో పోలిస్తే అంతగా ఆదరణ లభించడం లేదు. అయితే వన్డేలకు ఇప్పటికీ ప్రత్యేక ఆకర్షణ ఉంది. టీ20లకు దూరమైన పలువురు స్టార్ ఆటగాళ్లు వన్డేల్లో కొనసాగుతున్నారు. అందువల్ల టెస్టు క్రికెట్, ఫ్రాంచైజీ టీ20ల మధ్య వన్డేలు ఒక కీలకమైన వారధిగా మారే అవకాశం ఉంది. భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వంటి జట్లు పాల్గొనే వన్డే ట్రై-సిరీస్‌లకు భారీ ప్రేక్షకాదరణ లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా ద్వైపాక్షిక సిరీస్‌లకు భిన్నంగా ట్రై-సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌కు పాయింట్ల పట్టిక పరంగా ప్రాధాన్యం ఉంటుంది.

## అప్పుడు కలవనివ్వలేదు..

# ఇప్పుడు అదే హీరోతో!



మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది. '2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.

# పోలీసులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు



ప్రస్తుతం 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్.. వైజాగ్?లో కనిపించాడు. తన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ని ఘనంగా ప్రారంభించాడు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఇలా ఓ మల్టీప్లెక్స్ ఉండగా.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ లాంచ్ చేశాడు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు వైజాగ్ రోడ్డుపై అస్సలు నడవలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు. 'గంగోత్రి' రోజుల్లో వైజాగ్ రోడ్డుపై ఎవరూ నన్ను గుర్తుపట్టేవారు కాదు. ఇప్పుడు అదే రోడ్డుపై నడవలేకపోతున్నాను. 'రాకా' షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వైజాగ్ ప్రజల కోసం ఒక రోజు బ్రేక్ అడిగి వచ్చాను. అయితే పోలీసులు నన్ను ఎయిర్‌పోర్ట్ నుంచి పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు. వాళ్లకు థ్యాంక్స్' అని అన్నాడు. ఇక ఎదురుగా ఉన్న కొందరు అభిమానులు ఫొటో కావాలని అడగడంతో అందరూ ఇక్కడికి వచ్చేయండి అని స్టేజీపైకి ఆహ్వానించాడు. ఫ్యాన్స్‌కి నో అని చెప్పటం నా వల్ల కాదమ్మా అని అన్నాడు. ఎనిమిది స్క్రీన్లు ఉన్న ఈ మల్టీప్లెక్స్‌లో 'పుష్ప'లో గడ్డం కింద చేయి పెట్టే పోజు ఉన్న బన్నీ బొమ్మని ప్రదర్శన కోసం ఉంచారు. అలానే అల్లు అర్జున్‌కి సంబంధించిన పలు సినిమా స్టిల్స్ కూడా ఉంచారు. ఇకపోతే ప్రస్తుతం 'రాకా' చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ తన 23వ మూవీ చేయనున్నాడు. దీని ప్రీ ప్రొడక్షన్ వర్క్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్..

## ట్రైలర్ వచ్చేది ఆరోజే!



భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగష్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకానిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు ఈ ఫ్రాంచైజీ సిద్ధమైంది. ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4న కేవలం థియేటర్లలో మాత్రమే విడుదల కానుంది




# విజయ్ సేతుపతి 'స్లమ్ డాగ్' నుంచి అదిరిపోయే అప్డేట్.. ఇంటెన్స్ లుక్‌లో టబు !

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది

# 'చెన్నై లవ్ స్టోరీ' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. కిరణ్ అబ్బవరం మూవీ స్ట్రీమింగ్ ఎక్కడ అంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో మంచి స్పందన అందుకుంది. జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. 'బేబీ' సినిమాతో సక్సెస్ అందుకున్న సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు 21 నుంచి ఈ సినిమా ఓటీటీలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అధికారిక స్ట్రీమింగ్ తేదీపై మేకర్స్ లేదా ఓటీటీ సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ 'చెన్నై లవ్ స్టోరీ' స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, ఇప్పటికే చూసి మరోసారి సినిమా చూడాలనుకునేవారికి ఓటీటీ రిలీజ్ మంచి అవకాశంగా మారనుంది. 'చెన్నై లవ్ స్టోరీ' కథ విషయానికి వస్తే.. నివి అనే యువతి తన ప్రియుడు అజయ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. పెళ్లికి సిద్ధమవుతున్న సమయంలో అజయ్ తనకు మరో అమ్మాయి అంటే ఇష్టమని చెప్పి ఆమెతో విడిపోతాడు. ఊహించని బ్రేకప్‌తో నివి తీవ్రంగా కుంగిపోతుంది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె స్నేహితులు నివిని చెన్నైకి తీసుకెళ్తారు. కానీ అక్కడ కూడా ఆమె తన గతాన్ని మర్చిపోలేకపోతుంది. క్రమంగా మద్యానికి బానిసగా మారుతుంది. అదే సమయంలో అనుకోకుండా ఆమె జీవితంలోకి స్టీవెన్ శంకర్ అనే యువకుడు వస్తాడు. అనాథ అయిన స్టీవెన్‌కు డైరెక్టర్ కావాలన్నది కల. నివి స్నేహితుల గ్యాంగ్ అతడికి ఆశ్రయం కల్పిస్తుంది. మొదట్లో స్టీవెన్ చేసే పనులు, అతడి ప్రవర్తన నివికి చిరాకు తెప్పిస్తాయి. అయితే కాలక్రమంలో స్టీవెన్ మాటలు, అతడి ఆలోచనా విధానం నివిలో మార్పు తీసుకొస్తాయి. తన గత ప్రేమ వైఫల్యం నుంచి నెమ్మదిగా బయటపడిన నివి.. స్టీవెన్‌కు దగ్గరవుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలవుతుంది. అయితే అప్పుడే నివి గతం మరోసారి ఆమె ముందుకు వస్తుంది. అజయ్ మళ్లీ ఆమె జీవితంలోకి ఎందుకు వచ్చాడు? నివి, స్టీవెన్‌ల ప్రేమకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? చివరకు నివి ఎవరిని పెళ్లి చేసుకుంది? అనే అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరి ప్రియ హీరోయిన్‌గా నటించారు. త్రిగుణ్, దేవీ ప్రసాద్, సిరి హన్మంతు, పి. వాసు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో రవి నంబూరి దర్శకుడిగా పరిచయం అయ్యారు.

# మోదీ, షా ధైర్యం చేయడంలేదు

ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షాలు 15 రోజులుగా పార్లమెంటుకు వచ్చే ధైర్యం చేయడంలేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంటులో ప్రతిష్టంభనపై ఖర్గే, రాహుల్ గాంధీ దిల్లీలోని ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్?లో మాట్లాడారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై మాట్లాడేందుకు హోంమంత్రి అమిత్ షా సిద్ధమైన వేళ కాంగ్రెస్ తరపున 3 డిమాండ్లు చేశారు. దిల్లీలో యువతపై దాడికి అమిత్ షా ఆదేశించారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన దాడికి ప్రధాని క్షమాపణ చెప్పాలని, రామమందిర అంశంపై కూడా మాట్లాడాలని ఖర్గే, రాహుల్ స్పష్టంచేశారు. ఇవే డిమాండ్లను తాము గత 15 రోజులుగా చేస్తున్నట్లు వారివురూ చెప్పారు. పార్లమెంట్‌లో సాధారణ అంశాలపై అమిత్ షా చేసే ప్రసంగం పట్ల దేశానికి ఆసక్తి లేదన్నారు.

"మొదటి షరతు జరిగిన దానికి ఎవరు బాధ్యులు, ఎవరు దోషులో స్పష్టత కావాలి. రెండోది జరిగిన దానికి ప్రధాని క్షమాపణ చెప్పాలి. మూడోది రామమందిరం దొంగతనం. ఖర్గే వివరించినట్లుగా ప్రధానికి అత్యంత సన్నిహితులు రామమందిరం నుంచి నగదును దొంగిలించారు. ప్రధానంగా ఇవే ఆ మూడు అంశాలు. ఇప్పుడు అకస్మాత్తుగా అమిత్ షా మాట్లాడతానంటే ఆయన కల్పిత మాటలపై మాకు ఆసక్తి లేదు. పిల్లలపై కాల్పులు జరపడానికి ఆయన అనుమతి ఇచ్చారా లేదా అన్నదే మాకు కావాలి. ముందుగా ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. తర్వాతే చర్చ ప్రస్తావన వస్తుంది. మరో విషయం ప్రధాని, హోంమంత్రి తీరు. 15 రోజులుగా వారిద్దరికీ సభకు వచ్చే ధైర్యం లేకపోయింది.




తాము చేసిన దాన్ని ఒప్పుకునే దమ్ము వారిలో ఎవరికీ లేదు. విద్యార్థులు అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే దిల్లీలో మీకు జరిగిన దాని గురించి, క్రూరత్వం గురించి కనీసం స్పందించాల్సిన అవసరం ఉందని ఈ దేశ హోంమంత్రిగానీ, ప్రధానమంత్రిగానీ అనుకోవడం లేదు."

**మోదీ, అమిత్ షా మౌనం వహిస్తున్నారు : షా**

మరోవైపు రామ మందిర విరాళాల వివాదం, నీట్ పేపర్ లీక్‌పై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల చర్యపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మౌనం వహిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ రెండు విషయాలపై ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "విద్యార్థులపై పెల్లెట్ గన్లు, టియర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు ఉపయోగించారో కేంద్ర హోం మంత్రి వచ్చి చెప్పడమే మా మొదటి డిమాండ్. ప్రధాని మోదీనే ఈ ట్రస్ట్‌ను ప్రకటించి, ఏర్పాటు చేశారు. మోదీకి నమ్మకమైన ట్రస్టీలు రామ మందిరంలో దొంగతనానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలను ప్రధానే స్వయంగా వెల్లడించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కానీ ఇప్పటివరకు ఏం జరగలేదు. దోషులకు శిక్ష పడాలని, ప్రధాని దీనిపై ప్రకటన చేయాలని మేము కోరాం. కానీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. గత 15 రోజులుగా ప్రధాని, హోం మంత్రి ఈ అంశాలపై మాట్లాడలేదు. మేము ఈ అన్ని అంశాలపై పోరాడుతున్నాం. లక్షలాది మందికి రామమందిరంపై విశ్వాసం ఉన్నప్పటికీ, ఇంత పెద్ద ఘటన జరిగినప్పుడు ప్రధాని మోదీ మౌనం వహించారు. కాబట్టి ఆయన క్షమాపణ చెప్పాలి. ఈ మూడు అంశాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. మేము ఈ అంశాలపై పోరాడుతున్నాము. వీటిపై మేము దృఢంగా ఉన్నాం. ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాల్సిందే" అని ఖర్గే అన్నారు.

**ఝార్ఖండ్‌లో విద్యార్థులపై బలప్రయోగం తప్పు : రాహుల్**

ఇదిలా ఉండగా, ఝార్ఖండ్?లో యువత నిర్వహిస్తున్న ఆందోళనపైనా రాహుల్ గాంధీ స్పందించారు. "ఝార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం తప్పు. విద్యార్థులకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉంది. చర్చలు మాత్రమే పరిష్కారాలను చూపగలవు. ఝార్ఖండ్ ప్రభుత్వం ఈ విద్యార్థుల వాదనలను విని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలి." అని రాహుల్ ఎక్స్?లో పోస్ట్ చేశారు.

# ఝార్ఖండ్ అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత

ఝార్ఖండ్‌లో నియామక పరీక్షల నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని రాంచీలో విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. అసెంబ్లీ వైపు భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీగా కదిలారు. అసెంబ్లీ ముట్టడిలో భాగంగా ఆందోళనకారులు భద్రతా బలగాలు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వాటర్ కేనాన్లను ప్రయోగించి వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ముందుకు దూసుకెళ్తున్న భారీ జనసమూహాన్ని అడ్డుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆందోళనకారులపై లాఠీఛార్జ్ చేశారు.



జాతీయ జెండాలు చేతపట్టిన విద్యార్థులు బారికేడ్లను తోసుకుని అసెంబ్లీ వైపు ముందుకు వెళ్లేందుకు నిరసనకారులు తీవ్రంగా యత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బారికేడ్లను ఛేదించుకుని వస్తున్న ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వారిపై జల ఫిరంగులు ప్రయోగించారు. అయితే, ఈ ఉద్రిక్తతల మధ్య పలువురు విద్యార్థులు బారికేడ్ల పైకి ఎక్కి నిలబడ్డారు. పోలీసులు తమపైకి వాటర్ క్యానన్లతో నీటిని కొడుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ నీటి ధారల మధ్యే బారికేడ్ల పైనే డ్యాన్స్ చేస్తూ తమ నిరసనను వినూత్నంగా వ్యక్తపరిచారు. అయితే ఈ నిరసనల్లో స్పైడర మ్యాన్ ముసుగు ధరించి ఓ వ్యక్తి పాల్గొన్నారు. ప్రభుత్వం తమ మాటలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఝార్ఖండ్?కు వచ్చినట్లు తెలిపాడు. అసలు ప్రభుత్వం మాట వినడానికి ఏదైనా చేయడానికి కూడా ఇష్టపడటం లేదని చెప్పాడు.

**ఆందోళనలో దేవేంద్రనాథ్ మహతో**

ఝార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా (జేఎల్?కేఎం) నేత దేవేంద్రనాథ్ మహతో కూడా నిరసనలో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ చిత్రపటాన్ని చేతబూని ఆయన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి చేరుకున్నారు. గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న మహతో అంబులెన్స్‌లో ఆందోళన ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు. నిరాహార దీక్షలో ఉన్నా, ముళ్ల కంచెలు మమ్మల్ని ఆపలేవని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను వినాల్సిందేనని అన్నారు. తనను హీరోగా చూడొద్దని, తాను సాధారణ వ్యక్తినేనని పేర్కొన్నారు. విద్యార్థులు మూడు అంచెల బారికేడ్లను దాటారని చెబుతూ, ప్రభుత్వం వారి డిమాండ్లపై ఎందుకు సానుకూలంగా స్పందించడం లేదని ప్రశ్నించారు.

**'రక్తపాతం జరగకూడదు'**

ఆందోళనకారులపై పోలీసు చర్యలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను దేవేంద్రనాథ్ కోరారు. నిరసన సమయంలో ఎవరూ గాయపడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అరెస్టు చేయడం చట్టపరమైన ప్రక్రియేనని, అయితే ఎలాంటి రక్తపాతం చోటుచేసుకోకూడదని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను అంగీకరించకపోతే ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన ప్రభుత్వంగా గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు. తన నిరాహార దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ఆందోళనకారులతో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ, ప్రతిష్టంభనను తొలగించడంలో విఫలమైంది. చివరి విడత చర్చల అనంతరం, నిరసనకారుల డిమాండ్లలో 98 శాతాన్ని అంగీకరించామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, రద్దు చేయాలని కోరిన 13 పరీక్షల్లో కేవలం మూడింటిని మాత్రమే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని నిరసనకారులు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలన్న తమ డిమాండ్ నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదు అని స్పష్టం చేశారు. జేఎస్?ఎస్?సీ- సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని కూడా కోరుతున్నారు. ఇదే సమయంలో జేపీఎస్?సీ నిర్వహించిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం కీలక చర్య చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. విద్యార్థుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన అక్రమాలపై దర్యాప్తు అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# రామమందిర పూజారులకు కొత్త డ్రెస్ కోడ్

అయోధ్య రామమందిర పూజారుల వస్త్రధారణలో మార్పులు చేశారు. ఇకపై రామమందిర గర్భగుడిలోకి ప్రవేశించే సమయంలో పూజారులు రామానందాచార్య సంప్రదాయం ప్రకారం కుట్టని పసుపు రంగు వస్త్రాలను ధరించనున్నారు. ముఖ్యంగా సిల్క్‌తో తయారైన కుట్టని ఉత్తరీయాన్ని ధరించాలని నిర్ణయించారు. చలికాలంలో కూడా ఇదే తరహా కుట్టని ఉన్ని వస్త్రాలను ఉపయోగించనున్నారు. రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ అనంతరం పూజారులు చౌబందీ (కుర్తా) ధరించే విధానం అమల్లో ఉంది. తాజాగా పూజా వ్యవస్థను రామానందాచార్య సంప్రదాయం, ప్రాచీన వైష్ణవ ఆచారాలకు అనుగుణంగా రూపొందించేందుకు నిబంధనల్లో మార్పులు చేస్తున్నారు. ఆలయంలో పూజా కార్యక్రమాలకు శాశ్వతమైన, క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావడమే లక్ష్యంగా ఆ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**పూజారులకు ప్రత్యేక నియమావళి**

సోమవారం జరిగిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మతపరమైన కమిటీ సమావేశంలో పూజారులకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. పూజారుల నియామకం, వారి ఆచరణ, రోజువారీ విధులు, పూజా విధానం, భగవంతుడి అలంకరణ, నైవేద్యం, హారతి, ఇతర ధార్మిక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక నియమావళిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న విధానాలను సమీక్షించి ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా వాటిని మరింత స్పష్టంగా రూపొందించనున్నారు. ఇందుకోసం నియమావళి ముసాయిదాపై కమిటీ సభ్యులు చర్చించారు. త్వరలోనే ఆ నిబంధనలను ఖరారు చేసి రామమందిరంలోని నిత్యపూజా కార్యక్రమాల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. పూజారుల వస్త్రధారణపై కమిటీ సభ్యుడు రాజ్?కుమార్ దాస్ కీలక వివరాలు వెల్లడించారు. పూజారులంతా సిల్క్‌తో తయారైన కుట్టని ఉత్తరీయాన్ని ధరించనున్నట్లు తెలిపారు. శీతాకాలంలో కూడా అదే విధానాన్ని అనుసరిస్తూ కుట్టని ఉన్ని వస్త్రాలను ధరిస్తారని చెప్పారు.

**ఆలయ నిర్వహణపై చర్చ**

అదే సమయంలో రామమందిర నిర్వహణకు సంబంధించి కూడా మతపరమైన కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆలయ నిర్వహణకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)ను నియమించాల్సిన అవసరం లేదని మతపరమైన కమిటీ సభ్యుడు మహంత్ మిథిలేశ్ నందినీ శరణ్ అభిప్రాయపడ్డారు. అయితే ప్రభుత్వం లేదా ట్రస్ట్? అటువంటి నియామకం చేస్తే తాను వ్యతిరేకించబోనని స్పష్టం చేశారు. ఆలయాల నిర్వహణలో ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రాధాన్యం ఉండాలని ఆయన అన్నారు. ఆలయాలు, మఠాలు, ఆశ్రమాల సంప్రదాయాలతో అనుబంధం ఉన్నవారికి నిర్వహణలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిపాలనా సామర్థ్యం ఉన్న వ్యక్తి ఆలయాన్ని నిర్వహించగలిగినా ఆయన దృష్టి పూర్తిగా పరిపాలనా వ్యవస్థపైనే ఉండే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. దేశంలోని పలు ప్రముఖ ఆలయాల నిర్వహణ సీఈవోల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే రామమందిరం వంటి పవిత్ర క్షేత్రాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలు, పూజా విధానాలకు తగిన ప్రాధాన్యం ఉండాలని స్పష్టం చేశారు. ఇక అయోధ్య రామమందిరంలో ఆగస్టు 15 నుంచి 12 రోజుల పాటు ఝూలనోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నూతనంగా ఏర్పాటు చేసిన మతపరమైన కమిటీ సభ్యులు ఇప్పటికే తొలి సమావేశంలో చర్చించారు. ఉత్సవం తొలి రోజు ఉత్తర ద్వారం నుంచి రామ్?లల్లా ఉత్సవ విగ్రహంతో పల్లకి యాత్ర నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన ద్వారం ముందు నుంచి ఆ యాత్ర కొనసాగి ప్రాకార ప్రాంతం, ఆలయ పరిసరాల మీదుగా కుబేర్ టీలా వరకు చేరుకోనుంది. అక్కడ సుమారు రెండు గంటల పాటు ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాలు పూర్తైన తర్వాత ఉత్సవ విగ్రహాన్ని తిరిగి గర్భగుడికి తీసుకురానున్నారు. అనంతరం రామ్?లల్లాను బంగారు అలంకరణతో కూడిన వెండి ఉయ్యాలలో ఆశీనులను చేయనున్నారు. ఝూలనోత్సవం తొలి రోజు రామ్?లల్లా ప్రాచీన కుబేర్ టీలా వద్ద ఝూలాలో ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం శృంగార హారతి అనంతరం స్వామివారిని ఝూలాలో ఉంచనున్నారు.

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్..

ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు. గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.జ

## గందరగోళం సృష్టించడమే ఆయన లక్ష్యం

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత 15 రోజులుగా పార్లమెంటుకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగిస్తూ, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాహుల్? గాంధీ డిమాండ్‌ను అంగీకరించి, నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం ఒప్పుకుందని, కానీ ఆయన పదేపదే మాట మారుస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. "రాహుల్ గాంధీ పార్లమెంటులో, జాతీయ చర్చలోనూ రోజూ తన వాదనలను మారుస్తూనే ఉన్నారు. చర్చలు జరపడం కాదు, గందరగోళం సృష్టించడమే ఆయన లక్ష్యం. పార్లమెంటు సమావేశాలు ప్రారంభంలో ఆయన నీట్?పై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. మేము దానికి అంగీకరించినప్పుడు ఆయన ఆ విషయాన్ని రామ మందిర్ ట్రస్ట్ వైపు మళ్లించారు. ఆ తర్వాత, జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘటనపై హోం మంత్రి ఒక ప్రకటన చేయాలని పట్టుబట్టారు. ముఖ్యంగా, సభ సజావుగా పనిచేయకుండా అడ్డుకోవడమే ఆయన ఉద్దేశం. సభ పనిచేయడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే గత 15 రోజులుగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తూనే, ఒకవైపు జంతర్ మంతర్ విషయంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అంతకుముందు మీరు ాx= అంశంపై చర్చను కోరారు. దానిపై సమగ్రమైన చర్చ కూడా జరిగింది. కానీ మేము సమాధానం ఇచ్చే సమయానికి మీరు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ధరల పెరుగుదలపై చర్చను కోరారు. మేము దానిపై చర్చను చేపట్టాము. ప్రభుత్వం సమాధానం ఇస్తున్నప్పుడు, సభలో కూర్చుని వినే ధైర్యం కూడా కాంగ్రెస్ పార్టీకి లేకుండా పోయింది. ఇదే వారి చరిత్ర, ఇదే వారి రికార్డు. అందుకే, వారు చర్చ కోరిన ఏ రాజకీయ అంశంపై అయినా సరే చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. రాహుల్ గాంధీని మరోసారి సభకు రావాలని సవాలు చేస్తున్నాను. మేము చర్చకు సిద్ధంగా ఉన్నాం. మీకు తగిన సమాధానం లభిస్తుంది. అలాగే, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. జంతర్ మంతర్ వద్ద ఎలాంటి కాల్పులు జరగలేదు. అలాగే అక్కడ కాల్పులు జరపాలని ఎటువంటి ఆదేశాలు కూడా ఇవ్వలేదు." "ఝార్ఖండ్‌లో విద్యార్థుల గొంతుకలు వారికి వినిపించడం లేదా నా సమాచారం ప్రకారం, అక్కడ ముళ్ల కంచెలను వారి సూచన మేరకే ఏర్పాటు చేశారు. ఎందుకంటే అక్కడ ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీ వారి ఇండీ కూటమిలో అంతర్భాగమే కదా. అక్కడ విద్యార్థుల ఆవేదన వారికి వినిపించడం లేదా? రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు, దేశ భవిష్యత్తు లేదా దేశ పురోగతి పట్ల వారికి ఎలాంటి నిజమైన శ్రద్ధ లేదని స్పష్టం చేస్తున్నాయి. వారి చర్యలు ఎప్పుడూ అరాచకాన్ని సృష్టించడం, ప్రతికూల రాజకీయాలు చేయడం, బాధ్యతారహితమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం వరకే పరిమితమయ్యాయి. నేను దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను." అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు.

**రాహుల్ గాంధీ పారిపోవద్దని నేను కోరుతున్నాను : రిజిజు**

పార్లమెంటులో నెలకొన్న ప్రతిష్టంభన వేళ విద్యార్థుల నిరసనలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇచ్చే సమాధానాన్ని వినే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ, లోక్?సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంపై స్పందిస్తూ రిజిజు ఈమేరకు వ్యాఖ్యానించారు. "నీట్ విషయంలో విద్యార్థుల నిరసనలపై చర్చించడానికి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని నేను ఇప్పటికే స్పష్టంగా చెప్పాను. పార్లమెంటులో పూర్తి స్థాయి సమాధానం ఇవ్వడానికి హోం మంత్రి అమిత్ షా సంసిద్ధంగా ఉన్నారు. పార్లమెంట్?లో చర్చ, హోం మంత్రి సమాధానం కోసం రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారు. మేము దానికి సిద్ధంగా ఉన్నాం. చర్చ నుంచి ఎవరు పారిపోతారో ఇప్పుడు చూద్దాం. విద్యార్థుల నిరసనలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమిత్ షా గారి సమాధానాన్ని వినే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా లేక వారు పారిపోతారా అనేది ఇప్పుడు తేలుతుంది" "మీరు (రాహుల్ గాంధీ) ఆరోపణలు చేసి పారిపోతారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదు. మీరు దీన్ని ఎదుర్కోవాలి. కాంగ్రెస్ కోరుకున్నంత సేపు చర్చించడానికి, సమాధానం ఇవ్వడానికి హోం మంత్రి సిద్ధంగా ఉన్నారు. రాహుల్ గాంధీ పారిపోవద్దని నేను కోరుతున్నాను. సాకులు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రధాన మంత్రి నుంచి సమాధానం కోరడం లేదా క్షమాపణ చెప్పాలని పట్టుబట్టడం కేవలం నాటకం. మేము లోక్‌సభలో సూటిగా చర్చ జరగాలని కోరుకుంటున్నాం. రాహుల్ గాంధీ దీని నుంచి పారిపోలేరు. చర్చను డిమాండ్ చేసి పారిపోవడం పిరికివాడి లక్షణం. స్పీకర్ ఎప్పుడు సమయం కేటాయిస్తే అప్పుడు అది మంగళ, బుధవారం చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ పారిపోకూడదు." అని కిరణ్ రిజిజు అన్నారు.

## 6 వేల కిలోమీటర్లు ప్రయాణించి చైనాను తాకిన ప్రచండ టైఫూన్ 'డాల్ఫిన్'...

ఈ ఏడాది చైనాను తాకిన అత్యంత శక్తివంతమైన టైఫూన్ 'డాల్ఫిన్' తూర్పు తీర ప్రాంతంలో ప్రళయం సృష్టిస్తోంది. ఆదివారం సాయంత్రం తీరం దాటిన ఈ టైఫూన్ కారణంగా భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు 10 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టైఫూన్ ప్రభావంతో రవాణా, పర్యాటక రంగాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఆదివారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో జెజియాంగ్ ప్రావిన్స్‌లోని యుహువాన్ నగరం సమీపంలో డాల్ఫిన్ టైఫూన్ తీరాన్ని తాకింది. ఆ సమయంలో గంటకు 151 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గంట వ్యవధిలోనే సమీపంలోని వెన్‌జౌ నగరం వద్ద రెండోసారి తీరం దాటింది. దీంతో అధికారులు దేశంలోనే అత్యున్నత స్థాయి 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. టైఫూన్ తీరం దాటినప్పటికీ, దాని ప్రభావం కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు చేపట్టిన సహాయక చర్యలు మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఉన్నాయి. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 9 లక్షల మందిని, తైజౌలో 3.90 లక్షల మందిని, ఫుజియాన్ ప్రావిన్స్‌లో 1.67 లక్షల మందిని, షాంఘైలో 2.15 లక్షల మందికి పైగా ప్రజలను లోతట్టు ప్రాంతాల నుంచి ఖాళీ చేయించారు. ఒక్క వెన్‌జౌ నగరంలోనే 1,500 అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. టైఫూన్ కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఒక్క షాంఘైలోనే సుమారు 1,500 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హ్యాంగ్‌జౌ విమానాశ్రయంలోనూ వందలాది విమానాలు నిలిచిపోయాయి. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 686 రోడ్డు మార్గాలు, 658 రైలు సర్వీసులను నిలిపివేశారు. పోర్టులు, ఫెర్రీ సేవలు కూడా మూతపడ్డాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137